
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.2

ANDHRAJYOTHY



నల్లగొండ

5

సోమవారం 28 జూలై 2025

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
ప్రాజెక్టుల నీటిమట్టం	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	583 (291.3795)	93,115	35,749
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.30 (4.02)	1,287.02	1,885.43
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	158.463 (23.8180)	26,281	400

చికెన్ ధరలు | లైవ్ : రూ.137 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230



సాగర్‌లో.. విద్యుదుత్పత్తి షురూ

సాగర్ ప్రాజెక్టుకు ఈ ఏడాది నెల రోజుల ముందుగానే ఎగువ నుంచి వరదలు వచ్చి ప్రాజెక్టు పూర్తిస్థాయికి చేరువలో ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 25వ తేదీన ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభానికి నీటిపారుదలశాఖ అధికారులు అనుమతి ఇచ్చారు. దీంతో జెన్‌కో అధికారులు విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు.
-(ఆంధ్రజ్యోతి,నాగార్జునసాగర్)

- ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి నీటిపారుదలశాఖ అనుమతి
- ఇప్పటికే ఎడమ కాల్వ జలవిద్యుత్ కేంద్రంలో ఒక టర్బైన్ ద్వారా విద్యుదుత్పత్తి

సాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్‌లు ఉన్నాయి. అందులో మొదటి టర్బైన్ ఇండియాకు చెందిన బీహెచ్‌ఈఎల్ కంపెనీ రూపొందించింది. మిగిలిన ఏడు టర్బైన్‌లు జపాన్ టెక్నాలజీకి చెందినవి. అందులో బీహెచ్‌ఈఎల్ టర్బైన్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 110 మెగావాట్లు. మిగిలిన ఏడు టర్బైన్ల ఒక్కో దాని సామర్థ్యం 100.6 మెగావాట్లు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 815.6 మెగావాట్లు. కాగా, ఏటా ప్రధాన జలవిద్యుత్ కేంద్రం లక్ష్యానికి మించి విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఒక్క 2023-24లో మాత్రమే ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. అయితే ఈ ఏడాది జూన్ 30వ తేదీ నుంచే సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం మొదలైంది. 18 ఏళ్ల తర్వాత నెల రోజుల ముందుగానే జూలై నెలలోనే సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంది. దీంతో ప్రాజెక్టు అధికారులు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తికి ఈ నెల 25వ తేదీన అనుమతి ఇచ్చారు. అలాగే ఎడమ కాల్వ జలవిద్యుత్ కేంద్రంలో 30 మెగావాట్ల సామర్థ్యంతో రెండు టర్బైన్‌లు ఉన్నాయి. ఎడమ కాల్వకు ప్రస్తుతం 4వేల క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేస్తుండంతో ఒక్క టర్బైన్ ద్వారా మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. ఎడమకాల్వ పరిధిలోని ఈ జలవిద్యుత్ కేంద్ర ద్వారా 24 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, ప్రధాన విద్యుత్ కేంద్రం ద్వారా ఒక మిలియన్ యూనిట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

క్రస్ట్ గేట్లు ఎత్తితే నీళ్లన్నీ సముద్రంపాలు

సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు ఎత్తితే నీళ్లన్నీ సముద్రం పాలవుతాయి. అలా వృథాగా నీరు పోకుండా ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తికి నీటిపారుదల శాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. దీంతో విద్యుదుత్పత్తి చేస్తున్నామని అధికారులు తెలిపారు.

ఐదేళ్లలో సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తి వివరాలు...

సంవత్సరం	లక్ష్యం (మి.యూ)	ఉత్పత్తి (మి.యూ)	వినియోగించిన నీరు (టీఎంసీల్లో)
2020-21	1290	1248.78	184.15
2021-22	1535	2262.52	335.37
2022-23	1500	2355.62	347.82
2023-24	1400	540.84	95.84
2024-25	1400	1922.26	283.90
2025-26	1450	210	36.77

ఐదేళ్లల్లో ఎడమ కాల్వ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ఇలా..

సంవత్సరం	లక్ష్యం (మి.యూ)	ఉత్పత్తి (మి.యూ)	నీటిమట్టం (అడుగుల్లో)
2020-21	60	101.17	590
2021-22	97	148.32	590
2022-23	60	140.05	590
2023-24	69	0	529
2024-25	69	86.32	590
2025-26	69	24	576

(ఈఆర్థిక సంవత్సరంలో జూలై 24వ తేదీ వరకు) 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రాజెక్టుకు వరద రాకపోవడంతో క్రాప్‌హాలిడే ప్రకటించారు. దీంతో ఎడమ కాల్వ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేయలేదు.

ఫేస్ రికగ్నైజేషన్‌తో
ఇక ఆసరా పెన్షన్

- రాష్ట్రవ్యాప్తంగా అమలుకు ప్రభుత్వం సన్నాహాలు
- వేలిముద్రల విధానానికి త్వరలో స్వస్తి
- సమయం ఆదా, అక్రమాలకు చెక్
- పైలెట్ మండలంగా నార్కట్‌పల్లి
- అమ్మనబోలులో ప్రయోగాత్మక చెల్లింపు సక్సెస్





అమ్మనబోలులో కొత్త యాప్ ద్వారా పెన్షన్ డబ్బులు అందజేస్తున్న సెర్ప్, పోస్టల్ అధికారులు, యాప్‌లో పెన్షన్‌దారుడి ఫేస్ రికగ్నైజేషన్ చేస్తున్న సిబ్బంది

ప్రభుత్వ విభాగాల్లో హాజరు నమోదు కోసం అమలులో ఉన్న ఫేస్ రికగ్నైజేషన్ (ముఖగుర్తింపు) యాప్ విధానాన్ని తాజాగా, ఆసరా పెన్షన్‌ల పంపిణీలోనూ అమలుచేస్తున్నారు. ఇంతకాలం వేలి ముద్రలు వేసి పెన్షన్ పొందిన ఆసరా పెన్షన్‌దారులు ఇకపై ఫేస్ రికగ్నైజేషన్ హాజరు ద్వారా డబ్బు అందుకోనున్నారు. మున్ముందు వేలిముద్రల విధానానికి క్రమంగా స్వస్తి పలకనున్నారు. ఈ విధానంతో సమయం ఆదా కావడంతో పాటు పెన్షన్ పంపిణీలో అక్రమాలకు చెక్ పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,నార్కట్‌పల్లి)

సెర్ప్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఫేస్ రికగ్నైజేషన్ యాప్ అమలుకు జిల్లాలోని నార్కట్‌పల్లి మండలాన్ని పైలెట్‌గా ఎంచుకున్నారు. శనివారం అమ్మనబోలులో ఈ విధానం ద్వారా సుమారు 57 మంది పెన్షన్ దారులకు డబ్బు అందజేసే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రయోగాత్మక అమలులో గుర్తించిన లోపాలను సవరించి ఈ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలుచేయనున్నారు.

సమయం ఆదా...

ఇప్పటి వరకు పీవోటీడీ (పాయింట్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్ డివైజ్) ద్వారా పోస్టు ఆఫీసుల్లో ఉన్న ఫింగర్ ప్రింట్ (బయోమెట్రిక్) పరికరాలల్లో వేలిముద్ర వేయించి పెన్షన్ ఇచ్చే విధానం అమలులో ఉంది. ఐతే పీవోటీడీ పరికరాలు కేవలం 2జీ సామర్థ్యం కలిగినవే కావడంతో సిగ్నల్స్ అందక, కొందరి వేలిముద్రలను..

- మిగతా 8వ పేజీలో...

కేంద్రం బీసీ మంత్రిత్వశాఖ
ఏర్పాటు చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నల్లగొండ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు డిమాండ్ చేశారు. బీసీలు ఎదుర్కొంటున్న పరిష్కరించాలని ఆగస్టు 7వ తేదీన గోవాలో నిర్వహించనున్న ఓబీసీ మహాసభ పోస్టర్‌ను జిల్లాకేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. దేశంలో మొట్టమొదటి సారి బీపీ మండల్ సిఫార్సుల ప్రకారం ఉద్యోగ రంగాల్లో 27 శాతం రిజర్వేషన్‌ను దివంగత ప్రధాన మంత్రి వీపీసింగ్ అమలు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థలో క్యాబినెట్ తీర్మానం చేసి గవర్నర్‌కు పంపినా ఇంతవరకు ఆమోదం తెలపలేదన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, నాయకులు కాసోజు విశ్వనాథం, నల్ల సోమమల్లన్న, కంది సూర్యనారాయణ, జివ్వాజి ఇంద్రయ్య, గంజి బిక్షమయ్య, జెల్ల అదినారాయణ, వాడపల్లి సాయిబాబా, నల్ల మధుయాదవ్, కందుల వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి పోలీస్ గ్రీవెన్స్ రద్దు

నల్లగొండ క్రైం, జూలై 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్ డేను రద్దు చేసినట్లు పోలీస్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎస్పీ శరత్ చంద్రపవార్ అందుబాటులో లేనందున కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొంది.

గ్రామ పాలన అధికారుల
సర్వేయర్ల పరీక్షలు ప్రశాంతం

నల్లగొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలన అధికారులు, లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షలు ఆదివారం జరిగాయి. పట్టణంలోని ఎన్జీ కళాశాలలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షకు 378మంది హాజరు కావాల్సి ఉండగా 300మంది హాజరయ్యారు. 78 మంది గైర్హాజరయ్యారు. గ్రామ పరిపాలన అధికారుల పరీక్షకు 129మందికి గాను 110మంది హాజరయ్యారు. 19మంది గైర్హాజరయ్యారు. జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి నల్లగొండ ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

నేటి మొక్కలే రేపటి వృక్షాలు

మిర్యాలగూడ టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): నేటి మొక్కలే రేపటి వృక్షాలని పర్యావరణ ప్రియుడు రావుల శ్రీనివాస్ అన్నారు. మొక్కల పెంపకంపై ఆదివారం పట్టణంలోని పలు కాలనీలలోని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన రావుల శ్రీనివాస్ మాట్లాడుతూ స్వయంగా పెంచిన మొక్కలను రైతులకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. తుమ్మ, బొప్పాయి, వేప, నేరేడు మొక్కలను అన్నదాతలకు అందించేందుకు పెంచుతున్నట్లు తెలిపారు. ప్రతీ విద్యార్థి ఈ సీజన్‌లో ఒక మొక్కని నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు.



మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్

దేవరకొండ/చందంపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు మంజూరుచేస్తామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తోందని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఆదివారం దేవరకొండలోని 20వ వార్డులో రూ.1.35కోట్లతో నిర్మించనున్న సీసీరోడ్ల పనులకు ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం చందంపేట మండలం పోలేపల్లిలో చందంపేట, నేరేడుగొమ్ము మండలాలకు చెందిన లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు అందజేస్తోందన్నారు. జిల్లాలో 62,155 నూతన రేషన్‌కార్డులు మంజూరుకాగా, దేవరకొండ నియోజకవర్గంలో నూతనంగా 11,736మంది లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. దేవరకొండ నియోజకవర్గానికి ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేసి అధిక ప్రాధాన్యం ఇస్తానన్నారు. నియోజకవర్గంలో గురుకులాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. దళిత, గిరిజన, మైనార్టీ సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్, వేదికపై కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బాలునాయక్

అన్ని హామీల అమలు : ఎమ్మెల్యే బాలునాయక్

సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అంచలంచెలుగా అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు. నియోజకవర్గంలో రూ.360కోట్ల రైతు రుణాలు మాఫీ అయ్యాయన్నారు.ఐదేళ్లలో 20 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి అర్హులైన పేదలందరికీ పంపిణీ చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయాలని,పోలేపల్లి వద్ద ఐటీఐ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. పెండ్లిపాకల, నక్కలగండి భూనిర్వాసితులందరికీ పరిహారం అందజేస్తామన్నారు.

పేదల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తోందని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. కాంగ్రెస్ బడుగు, బలహీనవర్గాల పార్టీ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ అబద్ధాలతో మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి చత్రునాయక్, కృష్ణవేణి, శైలజ, మార్కెట్ కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, తహసీల్దార్ ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సాయిసన్నిధిలో పూజల్లో పాల్గొన్న మంత్రి

చింతపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): దేవరకొండకు వెళ్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చింతపల్లి సాయినాథుడిని దర్శించుకున్నారు. తొలుత ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం మంత్రిని ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో మాల్ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, ఎరుకుల వెంకటయ్య గౌడ్, ముచ్చర్ల యాదగిరి, అంగిరేకుల గోవర్ధన్, మాస భాస్కర్, గుండ్లపల్లి నరసింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్‌యాదవ్, పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలి

రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నల్లగొండరూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ, రిజర్వాయర్లను లింక్ కెనాల్ ద్వారా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని డాక్టర్స్‌కాలనీలో సిద్ధార్థ కాలేజీలో ఆదివారం నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదని అన్నారు. ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని, రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులందరికీ నాణ్యమైన విత్తనాలు, యూరియా, పురుగు మందులను అందించాలని అన్నారు. ఈ మహాసభకు ముందు లెక్కల రామచంద్రారెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఊట్కూరు మధుసూదన్‌రెడ్డి, కుంభం కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు విన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి నకిరేకంటి జానయ్య, కోశాధికారి బోధనపు వెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా బట్టు నిర్మల, సత్తయ్య, రామకృష్ణారెడ్డి, విష్ణుమూర్తి, పాక మల్లయ్య, రామచంద్రారెడ్డి, బుచ్చిరెడ్డి, చెరుపల్లి విజయ, ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ వైస్‌చైర్మన్ సయ్యద్ ఆసం, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, కుంభం లక్ష్మమ్మ, ప్రసన్న, సరిత, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడటౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆదివారం ఆయన ద్విచక్ర వాహనంపై పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంద్రాగస్టు నాటికి పట్టణంలో చెత్తకుప్పలు లేకుండా చూడాలన్నారు. డ్రైనేజీల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ సాగించాలని, ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మునిసిపల్ వార్డు ఆఫీసర్లతో వార్డుల వారీగా చెత్త, డ్రైనేజీ వ్యవస్థపై సమీక్ష నిర్వహించాలని, ప్రజా సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.



స్కూటీపై వచ్చి మిర్యాలగూడలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

శ్రావణమాసంలో..
కొండెక్కిన కొబ్బరి



- పెరిగిన టెంకాయ ధర
- బెంబేలెత్తుతున్న భక్తులు

ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్

శ్రావణమాసం పండుగలకు ప్రసిద్ధి. ఈ మాసంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతుంటాయి.దీంతో ఆలయాలకు వచ్చే భక్తుల సంఖ్య సైతం అధికంగానే ఉంటుంది. ఆలయాలకు వెళ్లే భక్తులు టెంకాయ సమర్పించడం ఆనవాయితీ. అయితే పెరిగిన టెంకాయ ధరలు భక్తులను బెంబేలెత్తిస్తున్నాయి. సన్న రకం కాయల ధర రూ.25 నుంచి 30 వరకు ఉండగా, లావు టెంకాయ ధర రూ.35 నుంచి రూ.40 వరకు పలుకుతోంది. 7

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


నాగరాజు మృతదేహం

చింతలపాలెం, జూలై 27(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో నక్కగూడెం గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాణావత్ నాగరాజు (30) రోజు మాదిరిగా ఆదివారం ఉదయం చేపల వేటకు వెళ్లాడు. ఇంటికి తిరిగి వచ్చే సమయంలో తెప్ప పడవపై నుంచి కాలు జారి నదిలో పడిపోయాడు. చేపల వేటకు వెళ్లిన నాగరాజు ఎంత సేపటికీ రాకపోవడంతో అయనతో వచ్చిన వారు తిరిగి వెళ్లి చూడగా, నాగరాజు నదిలో పడి కనిపించడంతో నది నుంచి బయటకు తీసి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని ఇంటికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. నాగరాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుండెపోటుతో రిటైర్డ్ వీఆర్వో..


మోహన్‌రెడ్డి(ఫైల్)

దేవరకొండ, జూలై 27(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొమ్మేపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్వో లోకసాని మోహన్‌రెడ్డి(79) గుండెపోటుతో ఆదివారం మృతిచెందారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కొమ్మేపల్లికి చేరుకొని మోహన్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు. మోహన్‌రెడ్డి కుమారుడు లోకసాని శ్రీధర్‌రెడ్డి కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఉన్నారు. సంతాపం తెలిపిన వారిలో కాంగ్రెస్ నాయకులు ఎంఎ. సిరాజ్‌ఖాన్, ఆలంపల్లి నర్సింహ, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, వడ్త్య దేవేందర్‌నాయక్, జాన్‌యాదవ్, శిర ందాసు కృష్ణయ్య, పున్న వెంకటేశ్వర్లు, హనుమంతు వెంకటేష్‌గౌడ్, జూలూరి ధనలక్ష్మీ బాలనారాయణగౌడ్, మారేపాకల సురేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మనోవేదనతో బలవన్మరణం

మాడ్గులపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మనోవేదనతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం జరిగింది. రైల్వే ఎస్‌ఐ బి. రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... మండలకేంద్రానికి చెందిన పందిరి జానయ్య(40) కొంత కాలంగా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. భార్య లేకపోవడంతో మానసికంగా కుంగిపోయి మతిస్థిమితం కోల్పోయి ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మాడ్గులపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ బి.రామకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ నుంచి మంటలు


పాక్షికంగా కాలిన బైక్

పెద్దఅడిశర్లపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళ్తున్న బైక్ నుంచి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి శివారులోని ఆదర్శ పాఠశాల వద్ద ఆదివారం జరిగింది. స్థానికులు, బాధితుడు రాపర్తి రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. పీఏపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పనినిమిత్తం అజ్మాపురం నుంచి పీఏపల్లికి బైక్‌పై వస్తుండగా దుగ్యాల ఆదర్శ పాఠశాల వద్దకు రాగానే ఆకస్మాత్తుగా మంటలు రావడంతో తేరుకొని వెంటనే బైక్‌ను నిలిపి దూరంగా వెళ్లాడు. స్థానికులు నీళ్లతో మంటలు ఆర్పేవేశారు. అప్పటికే బైక్ చాలా వరకు కాలిపోయింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

హుజూర్‌నగర్ , జూలై 27(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో పేకాట కేంద్రంపై పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. ఆదివారం సాయంత్రం టీచర్స్ కాలనీలోని స్వర్ణవేదిక ఫంక్షన్‌హాల్ సమీపంలో పేకాట ఆడుతుండగా ఐడీ పార్టీ పోలీసులు దాడులు చేసి ఆరుగునిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.5వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రామన్నపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట పట్టణం కేంద్రంలోని బీసీ హాస్టల్ సమీపంలోని ఓ గృహంలో పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేశారు. పేకాడుతున్న ఐదు మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.1450 నగదు, 5 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నార్కట్‌పల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో తాళం వేసి ఉన్న ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన దొడ్డి శంకరయ్య హైదరాబాద్‌కు వెళ్లాడు. అతని భార్య ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాను తెరిచి వస్త్రాలు చిందర వందర చేశారు. సుమారు తులం బంగారు ఆభరణాలు, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఎస్‌ఐ దగ్గుల క్రాంతికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉపాధ్యాయుడి వినూత్న ప్రచారం


మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సాగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్

నాగార్జునసాగర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సూర్యాపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ ప్రపంచ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌లో ఆదివారం వినూత్నంగా ప్రచారం చేశారు. మైకు పట్టుకుని విచిత్ర వేషధారణలో నో డ్రగ్స్.. సేవ్ లైఫ్ అంటూ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర్లు, ఉత్సవాలు, వారాంతపు సంతలు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో సెలవు రోజుల్లో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 150కి పైగా ప్రదర్శనలు ఇచ్చానని పేర్కొన్నారు. యువత మత్తుబారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

పది నెలల క్రితం అదృశ్యమై..

గరిడేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పది నెలల క్రితం అదృశ్యమైన వ్యక్తిని సూర్యాపేట జిల్లా పోలీసులు ఆదివారం కుటుంబసభ్యులకు అప్పగించారు. గరిడేపల్లి పరిధిలోని ఖుతుబ్‌షాపురం గ్రామానికి చెందిన షేక్ జాన్‌సైదులుకు కోదాడ పట్టణానికి చెందిన అమ్మాయితో వివాహం జరిగింది. కోదాడలో అత్తగారి ఇంటి వద్ద ఉంటూ లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. 10 నెలల క్రితం కోదాడలో భార్య, అత్త, మామాలతో గొడవ పడి స్వగ్రామం ఖుతుబ్‌షాపురం వచ్చాడు. అక్కడ నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. భార్య, అత్త, మామాల బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఫిబ్రవరి నెలలో వారు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. జాన్‌సైదులు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ ఇతర రాష్ట్రాలకు, అక్కడ నుంచి సమీప దేశాల్లో వివిధ ప్రాంతాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో లారీ లోడు దించేందుకు భూటాన్ దేశానికి వెళ్లిన జాన్‌సైదులు అక్కడే ఉండి లారీని మరో డ్రైవర్‌తో పంపించాడు. తరుచూ లారీ లోడ్‌లతో భూటాన్ పరిసర ప్రాంతాలకు వెళ్లడంతో గతంలో అక్కడి వారితో పరిచయం కావడంతో అక్కడే మొక్కజొన్న ఫ్యాక్టరీలో పనిచేస్తూ జీవనం సాగించాడు. తరుచూ ఫోన్ సిమ్‌కార్డు మార్చడంతో పోలీసులకు కూడా అతని ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా జాన్‌సైదులును ఇండియాకు రప్పించారు. 20 రోజుల క్రితం జాన్‌సైదులు హైదరాబాద్ రాగా, పోలీసులు అతన్ని పట్టుకొని ఎట్టకేలకు జాన్‌సైదులును కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ చలికంటి నరేష్, పోలీసు సిబ్బంది నాగేష్, విష్ణు, వెంకటేశ్వర్లు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ లీడర్ సర్వే ఫలితాలపై హర్షం

మిర్యాలగూడ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ లీడర్ సర్వేలో ప్రధాని మోదీ అత్యంత విశ్వసనీయ నేతగా ఎంపిక కావడంపై నల్లగొండ జిల్లా బీజేపీ ఇండస్ట్రీయల్ సెల్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ తల్లం అశోక్ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అమెరికాకు చెందిన మార్నింగ్ కన్సల్ట్ సంస్థ వి శ్వవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో ప్రజల విశ్వాసం పొందిన నేతల్లో ప్రధాని మోదీ ప్రథమ స్థానంలో నిలవడం గొప్ప విషయమన్నారు. ఇక సుదీర్ఘ కాలం దేశాన్ని పాలించిన రెండో ప్రధానిగా మోదీ మరో ఘనత సాధించడం చరిత్రలో నిలిచిపోయే అంశమన్నారు. కేంద్ర ప్రభుత్వం న్యాయ వ్యవస్థను బలోపేతం చేయాలని, తప్పుచేస్తే చర్యలుంటాయన్న భయం కలిగిలే వ్యవస్థను మార్చాలని ఆయన కోరారు.

ఫార్మర్ ఐడీ నమోదు ముమ్మరం

• రైతులకు తప్పనిసరి చేసిన కేంద్రం • 11 నెంబర్లతో కూడిన యూనిక్ ఐడీ కార్డు • అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు


నిడమనూరులో ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

నిడమనూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. నమోదుపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో మందకొడిగా సాగిన రిజిస్ట్రేషన్ నమోదు వేగవంతమైంది. వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన కలిగించడంతో పాటు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వేగంగా చేపడుతున్నారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతి రైతుకు కేంద్ర ప్రభుత్వం సూచిస్తుంది. రైతులు తమ దగ్గర్లోని వ్యవసాయ కార్యాలయాలకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వ్యవసాయ అధికారులు కూడా ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ గురించి విస్తృతంగా ప్రచారం చేసి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని డిజిటల్ చేసే కార్యక్రమంలో భాగంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయడంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, సాయిల్ హెల్త్ కార్డు, ఫసల్ బీమా తదితర పథకాలు రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకొని ఉండాలి. భవిష్యత్తులో ఎరువుల పంపిణీ కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకే ఉంటుందని తెలుస్తోంది. కొత్తగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు రైతుల ఖాతాలో జమ కావాలంటే ఈ ప్రక్రియ తప్పనిసరి. దీంతో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. నిడమనూరు మండలంలో 18797 మంది రైతులు ఉండగా 6121 మంది, నిడమనూరు క్లస్టర్ పరిధిలో 1190 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఇలా చేసుకోవాలి

రైతుల ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. పైసా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ కోసం సంబంధిత ఏఈవో లేదా ఏవోకు వివరాలు సమర్పించాలి. ఇందుకోసం రైతులు తమ ఆధార్‌కార్డుతో పాటు ఆధార్‌కార్డుకు అనుసంధానమైన మొబైల్ ఫోన్‌ను కూడా తీసుకెళ్లాలి. రైతుల వివరాలు నమోదు చేసేటప్పుడు ఫోన్‌కు మూడుసార్లు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని ఎంటర్ చేయగానే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. తర్వాత 11 అంకెల నెంబర్లతో కూడిన యూనిక్ ఐడీ కార్డు రైతుల ఇంటికి వస్తుంది.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తో ప్రయోజనాలు



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానంతో ప్రతి రైతుకు 11 అంకెల నెంబర్లు గల ఓ యూనిక్ ఐడీ కార్డు ఇంటికే వస్తుంది. దీంతో రైతుల భూముల వివరాలతో పాటు నేల స్వభావం, సర్వే నెంబర్లు, సాగు చేస్తున్న పంటల వివరాలు, తదితర రైతుకు సంబంధించిన సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ కార్డు ఉన్న రైతులకే భవిష్యత్తులో ప్రభుత్వం పథకాలు అందేలా చేస్తుంది.

ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



పట్టాదారు పాస్‌పుస్తకం కలిగిన ప్రత రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రైతుల కోసం ప్రభుత్వాలు అమలు చేసే పథకాలకు ఈ పార్మర్ యూనిక్ ఐడీ కార్డు తప్పనిసరి చేసింది. రైతులు తమ ఆధార్ కార్డుతో పాటు ఆధార్‌కార్డుకు అనుసంధానం అయిన మొబైల్ ఫోన్‌ను తీసుకువస్తే రిజిస్ట్రేషన్ చేస్తాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

• ఎం. ముని కృష్ణయ్య, ఏవో, నిడమనూరు.

వరుస చోరీలు చేసింది భార్యాభర్తలే

• గతంలో వీరిపై పలు కేసులు • వీడిన ఇళ్లలో దొంగతనాల మిస్టరీ


పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

భువనగిరి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలో ఇటీవల సంచలనం సృష్టించిన వరుస దొంగతనాల మిస్టరీ వీడింది. వారం రోజుల వ్యవధిలో స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో ఐదు ఇళ్లలో చోరీలకు పాల్పడిన దొంగలను భువనగిరి పట్టణ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పట్టణ శివారులో నిర్వహిస్తున్న వాహనాల తనిఖీల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. వరుస దొంగతనాలకు పాల్పడుతున్నది ఆ ఇద్దరేనని నిర్ధారణ కావడంతో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన బడ్డుల అనిల్, స్వాతి భార్యభర్తలు. వీరిద్దరూ సులభ సంపాదన కోసం దొంగలుగా మారారు. వీరిపై ఐదు పోలీస్‌స్టేషన్లలో పలు చోరీ కేసులు ఉన్నాయి. ఓ కేసులో అరెస్టు అయి 11 నెలల అనంతరం ఇటీవల జైలు నుంచి విడుదలయ్యారు. అయినప్పటికీ వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో భువనగిరి హెచ్‌బీ కాలనీలో 18వ తేదీ తెల్లవారుజామున రెండు ఇళ్లలో, 24వ తేదీ తెల్లవారుజామున అదే బస్తీలో అదే మాదిరిలో మరో రెండు ఇళ్లలో చోరీ చేసి బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీలు, ఇతర ఆధారాలతో దర్యాప్తు చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న దొంగలు పట్టుబడినట్టు పోలీసులు తెలిపారు.

అక్రమార్కులపై ఉక్కుపాదం

• యువత సైబర్ నేరాల పడకుండా చూస్తాం

• డ్రగ్స్, గంజాయి విక్రయిస్తే క్రిమినల్ కేసులు

• దొంగతనాలు అరికట్టడానికి పెట్రోలింగ్

• 'ఆంధ్రజ్యోతి'తో యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు



అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతామని యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయకుడు హెచ్చరించారు. ఇసుక, మట్టి అక్రమంగా తరలించి సహజ సంపదను కొల్లగొడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాల బారిన పడి జీవితాలు బలిచేసుకోకుండా యువతకు అవగాహన సదస్సులు నిర్వహించి వారికి అండగా ఉంటామన్నారు. డ్రగ్స్, గంజాయి విక్రయించినా సేవించినా జైలుకు పంపుతామన్నారు. సులువుగా డబ్బులు సంపాదించొచ్చని ఆన్‌లైన్ బెట్టింగ్‌ను ప్రోత్సహించే వారిపై చర్యలు తప్పవన్నారు. పట్టణంలో వ్యభిచారాన్ని పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు లేకుండా లాడ్జీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

• ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట రూరల్

ఆంధ్రజ్యోతి: ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?.

ఏసీపీ: నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే వారిపై ఉక్కుపాదం మోపుతాం.

ఆంధ్రజ్యోతి: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడి పోత్సహించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?.

ఏసీపీ: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై క్రిమినల్ కేసులు పెడతాం. యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌పై యువతకు కౌన్సిలింగ్ నిర్వహిస్తాం.

ఆంధ్రజ్యోతి : డ్రగ్స్, గంజాయి విక్రయించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు. వాటిని ఎలా అరికడుతారు?.

ఏసీపీ: డ్రగ్స్ గంజాయి విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపుతాం. గంజాయి సరఫరా మూలాలను కొనుగొని వారిపై కఠిన చర్యలు తీసుకొని వాటిని పూర్తిగా నియంత్రించడానికి కృషిచేస్తాం.

ఆంధ్రజ్యోతి: లాడ్జీలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు. వాటిని ఎలా నిర్మూలిస్తారు?.

ఏసీపీ : పట్టణంలో దాదాపు వ్యభిచారం తగ్గుముఖం పట్టింది. ఎవరైనా నిర్వహిస్తే చర్యలు తప్పవు. లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రతి లాడ్జీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించి ఆకస్మిక దాడులు ఉధృతం చేస్తాం.

ఆంధ్రజ్యోతి : ఈ మధ్య కాలంలో ఎక్కువగా చోరీలు జరుగుతున్నాయి వాటిని ఎలా అరికడతారు. ప్రజలకు రక్షణ ఎలా కల్పిస్తారు?.

ఏసీపీ : దొంగతనాలు జరగకుండా సిబ్బందితో పెట్రోలింగ్ ముమ్మరం చేస్తాం. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. వారి బంగారు ఆభరణాలు ఇంట్లో కాకుండా బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలి. కాలనీల్లో కొత్తవ్యక్తులు తారసపడితే వెంటనే సమాచారం ఇవ్వాలి.

ఆంధ్రజ్యోతి : పట్టణ, గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు ఏమిటి?.

ఏసీపీ : పట్టణ, గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం వస్తే వెంటనే తమ శాఖతో పాటుగా ఎక్సైజ్ శాఖ మూకుమ్మడిగా దాడులు చేసిన క్రిమినల్ కేసులు పెడతాం.

ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి

• న్యాయం చేయాలని బంధువుల ఆందోళన • నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో ఘటన

శాలిగౌరారం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. కట్టంగూరు మండలం కురుమర్తి గ్రామానికి చెందిన గండికోట శ్రీను(40) కుటుంబ సభ్యులతో కలిసి శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామంలో దగ్గరి బంధువు మృతిచెందగా అంత్యక్రియలకు వెళ్లాడు. సోమవారం సాయంత్రం గండికోట శ్రీను తన తల్లి లక్ష్మమ్మ, సోదరి సైదమ్మను బైక్ మీద తీసుకొని కురుమర్తికి బయలుదేరాడు. శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయం సమీపం వద్దకు రాగానే ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేకు చేసే క్రమంలో ప్రమాదవశాత్తు అదుపు తప్పి వెనుక టైర్ కింద పడి శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న శ్రీను తల్లి లక్ష్మమ్మ, సోదరి సైదమ్మ కుడి పక్కన పడడంతో ప్రాణాలతో బయటపడ్డారు. రోడ్డు మీద ప్రమాదం జరుగడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం జరిగింది. న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తతో శ్రీను మృతి చెందాడని ఆరోపించారు. శ్రీను మృత దేహాన్ని పోస్టమార్టం కోసం తీసుక వెళ్లడానికి పోలీసులు ట్రాక్టర్ తీసుక రాగా అడ్డుకున్నారు. శ్రీను కుటుంబానికి న్యాయం చేసేదాకా మృతదేహాన్ని తీసేదిలేదని భీష్మించుకుని కూర్చున్నారు. ఎస్‌ఐ సైదులు సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు ఎంత నచ్చచెప్పిన వినలేదు. న్యాయం జరిగే వరకు ఇక్కడే ఉంటామని ఆందోళన చేశారు. శాలిగౌరారం - భైరవునిబండ మీద ఈ ప్రమాదం చోటుచేసుకోవడం ఈ మార్గంలో వాహనాలు వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. వాహనాలు వెళ్లకుండా గడ్డి అడ్డవేసి అడ్డంగా కూర్చున్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రమాదం జరగగా రాత్రి 9 దాటిన తరువాత కూడా కుటుంబ సభ్యులు ఆందోళన విరమించలేదు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు చేస్తే కేస్ నమోదు చేస్తామని ఎస్‌ఐ సైదులు తెలిపారు.

పురాతన విగ్రహాలకు ఆదరణ కరువు



నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని తొండ్లాయి (పాత ఊరు) శివారలో బెల్లి నాగరాజు అనే రైతు వ్యవసాయ బావి వద్ద శివలింగం, ఇతర రాతి దేవతామూర్తుల విగ్రహాలు నిరాదరణకు గురవుతున్నాయి. 75 ఏళ్ల క్రితం ఈ విగ్రహాలను తయారు చేయించి ఉంటారని భావిస్తున్నారు. గుడి కట్టకపోవడంతో పానవట్టంతో కూడిన శివలింగం రాతిపై చెక్కిన ఇతర దేవతామూర్తుల ఆకారాలు గల విగ్రహాలు భిన్నమై ఆదరణకు నోచుకోలేదు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ నిరాదరణకు గురైన ఈ శివలింగంతో పాటు రాతిపై చెక్కిన ఇతర దేవతా మూర్తుల విగ్రహాల ఫొటోలను కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

• ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి

మఖానా.. ఆరోగ్య ఖజానా

• ఆరోగ్యాన్నిచ్చే తామర గింజలు • తింటే బోలెడు ఉపయోగాలంటున్న వైద్యులు

మఖానా.. ఇటీవల కాలంలో వినిపిస్తున్న పేరిది. తామర గింజల నుంచి వచ్చే మఖానాను ఫాక్స్ సీడ్ అని, గోర్గన్ నట్ అని కూడా పిలుస్తుంటారు. తామర పూల గింజల నుంచి వచ్చే మఖానాను పూల్ మఖానా అని కూడా పిలుస్తుంటారు. నార్త్ బీహార్‌లోని సహస్ర తదితర ప్రాంతాల్లో అధికంగా లభ్యమయ్యే మఖానా దేశ, విదేశాలకు ఎగుమతి అవుతోంది. లాక్‌డౌన్‌కు ముందు అంతగా ప్రచారంలో లేని లోటస్ సీడ్‌కు ప్రస్తుతం డిమాండ్ పెరిగింది. పోషకాలతో నిండిన ఈ ఆహారాన్ని అల్పాహారంగా, స్నాక్స్‌గా, సూప్‌గా, స్మూతీగా తీసుకుంటారు. లడ్డూలు, బర్ఫీ స్వీట్లు, మురుకులు, కొన్ని రకాల చిప్స్‌లలో మఖానాను కలుపుతారు.

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)



ప్రొటీన్లు, కార్బోహైడ్రేడ్లు, ఫైబర్, జింక్, పొటాషియం, కాల్షియం, భాస్వరం, యాంటి ఆక్సిడెంట్లు, ఫ్లవనాయిడ్లతో నిండిన మఖానా శక్తినివ్వడంతో పాటు జీర్ణక్రియను సక్రమం చేసి మల బద్ధకాన్ని నివారిస్తుందంటున్నారు వైద్య నిపుణులు. శరీరంలోని వేడిని నియంత్రించి, ఉదర సంబంధ వ్యాధులను దరి చేరనివ్వని మఖానాను ప్రతి రోజు ఆహారంలో తీసుకుంటే చర్మం మృదువుగా మారి, వృద్ధాప్య ఛాయలు దూరమవుతాయట. కొవ్వు కరిగించి అధిక బరువును తగ్గించే ఈ తామర గింజలు కండరాలు, గుండె బలాన్ని పెంచుతుంది. తెల్లవెంట్రుకలు రాకుండా చేయడంతో పాటు కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుందని పలు పరిశోధనలు పేర్కొనడం గమనార్హం. మొక్కల ఆధారితమైన ఈ విజిటేరియన్ ఫుడ్‌ను షుగర్ పేషంట్లు సైతం తీసుకోవచ్చంటున్నారు వైద్యులు.

ధర కాస్త ఎక్కువే..

మఖానా ధర కాస్త ఎక్కువ. అయితే దూది బంతుల్లా బరువు తక్కువగా ఉండే మఖానా ఎక్కువనే తూగుతాయి. 50గ్రాములు తూగే మఖానాలతో పెద్దల దొసిడి నిండుతాయి. రిలయన్స్, మోర్, డీమార్ట్, స్టార్ బజార్ తదితర బడా మాల్స్‌లో అందుబాటులో ఉంటున్న మఖానా పెద్దపెద్ద కిరాణా దుకాణాల్లోనూ అమ్ముతున్నారు. కిలో మఖానా ధర సుమారుగా రూ. 1300 నుంచి 1500గా ఉండగా, ఆన్‌లైన్ వ్యాపార సంస్థలు కాస్త తగ్గింపు ధరలో విక్రయిస్తున్నాయి.

ఆరోగ్యాన్నిచ్చే మంచి ఆహారం



మఖానా ఆరోగ్యాన్నిచ్చే మంచి ఆహారం. పోషక విలువలతో కూడిన మఖానాను బ్రేక్‌ఫాస్ట్, స్నాక్స్‌గా తీసుకోవచ్చు. ఇందులో ఉండే ప్రొటీన్లు, కార్బోహైడ్రేడ్లు, కాల్షియం, యాంటి ఆక్సిడెంట్లు మహిళలకు అవసరమైన శక్తినందిస్తాయి. ఎదిగే పిల్లలకు మఖానాని ఆహారంగా ఇస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. బన్నులు, బర్గర్లు, పిజ్జాలకు బదులుగా మఖానాతో చేసిన ఆహారాన్ని చిన్నారులకు అందిచవచ్చు. అందరూ తీసుకోవచ్చు.

• డాక్టర్ రమాదేవి, గైనకాలజిస్ట్.

పిల్లలకు స్నాక్స్‌గా ఇస్తున్నా



మఖానా బలమైన ఆహారమని సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని ట్రై చేశాను రుచి అద్భుతంగా ఉంది. వైద్యరంగంలో ఉన్న మా మిత్రులు కూడా మఖాని గురించి చెప్పడంతో అన్నిరకాల వంటలలో వాడుతున్నాను. పిల్లలకు స్నాక్స్‌గా ఇస్తుండగా, ఇష్టంతో తింటున్నారు. స్మూతీ తయారీలో మఖానా ఉండాల్సిందే. పాయసం, ఖీర్‌లలో కూడా తామర గింజలు ఉండాల్సిందే.

• చెరుపల్లి ఉష, గృహిణి, మిర్యాలగూడ.

డాక్టర్ నోములకు ఎక్స్‌లెన్స్ అవార్డు



ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుంటున్న నోముల వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ప్రభుత్వ అధ్యాపకుడు డాక్టర్ నోముల వెంకటేశ్వర్లుకు వింగ్స్‌ఆఫ్ ఫైర్ ఎక్స్‌లెన్స్ అవార్డును ప్రదానం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా, హైదరాబాద్‌కు చెందిన సామాజిక వేత్తలు, పర్యావరణ వేత్తలు గాలి, నీరు, భూమి ఎలా పరిరక్షించుకోవాలో విద్యార్థులకు వివరించి వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్య, మానసిక ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ అంశాల్లో సేవలు అందించినందుకు గాను. డాక్టర్ నోములకు మెమెంటో, ప్రశంసా పత్రం అందజేశారు. హనుమకొండ జిల్లా ఖాజీపేటలోని ఫాతీమానగర్‌లో గల బాలసదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందజేశారు.

అధిక వర్షాలతో పంటలకు ముప్పు

● చేనుల్లో నీరు నిల్వకుండా చూడాలి
● యాజమాన్య పద్ధతులపై వ్యవసాయాధికారుల సూచనలు

భువనగిరి (కలెక్టరేట్), జూలై 27 (ఆంధ్రజ్యోతి) ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలతో పంటలకు నష్టం జరిగే అవకాశం ఉంది. ప్రధానంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వరి, పత్తి, కంది, మొక్కజొన్న, పెసర్లతో పాటు పలు రకాల కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అధిక వర్షాలతో పొలాలు, చేనులలో అధికనీరు నిలిచిపోయి పం టలు చెడిపోయే ప్రమాదముందని ఉందన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత, పంట చేనుల్లో చేపట్టాల్సిన నీటిముంపు పరిస్థితులు-యాజమాన్య పద్ధతులను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త అనిల్ కుమార్ , యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయాధికారి నీలిమ పలు సూచనలు చేశారు.



కలుపు యాజమాన్య పద్ధతులు

ప్రస్తుత వర్షాల నేపథ్యంలో పంటల్లో అంతర కృషి ద్వారా పత్తి పంటలో కలుపు తీయలేము. పత్తి మొలకెత్తిన నెల రోజులకు చేనులో వచ్చిన లేత గడ్డి, వెడల్పాకు కలుపు నివారణకు ఎకరానికి 400 మి.లీ పైరిథయోబాక్ సోడియం 8 శాతం, క్విజలోపాస్ ఇథైల్ 2 శాతం మిశ్రమాన్ని 200 లీట్ల నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలి.

తాత్కాలికంగా పురుగు మందులు పిచికారీ చేయవద్దు



అధిక వర్షాలతో పొలం, చేనులో నిలిచిన నీటిని తీసివేసి త్వరగా పంట కోలుకోవడానికి లీటరు నీటికి 20 గ్రాముల యూరియా, లేదా ఒక శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. ఎట్టి పరిస్థితుల్లో పురుగుల మందులు, కలుపు మందులు పిచికారి చేయకుండా వాయిదా వేసుకోవాలి. నాటిన కొద్ది కాలంలో పడిన అధిక వర్షాలకు కూరగాయ పంటల మొక్కలకు నష్టం ఎక్కువగా జరిగితే తిరిగి మొక్కలను నాటుకోవాలి. వరి పంట పొలాల్లో అధికంగా ఉన్న నీరు వెళ్లేందుకు నీటి కాలువలు ఏర్పాటు చేయాలి. వరి నారుమడులు ముంపునకు గురై నారు ఎర్రబడి చని పోతే ప్రత్యామ్నాయంగా 120 రోజులు స్వల్పకాలిక రకాలైన కేఎన్ఎం -118, ఆర్ఎన్ఆర్ -29325, ఆర్ఎన్ఆర్ -28361, డబ్ల్యు జీఎల్ -915 వంటి రకాలను ఎంపిక చేసుకొని ఎకరానికి 12 కిలోల మొలకెత్తిన విత్తనాన్ని దుక్కి దున్ని దమ్ము చేసిన పొలంలో వేసుకోవచ్చు.-ఎస్.నీలిమా, యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయాధికారి

మొక్కజొన్న, పెసర సస్యరక్షణ చర్యలు

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల మొక్కజొన్న వేసిన నేలలో భాస్వరం లోపిస్తుంది. ఈ లోపంతో పంట మొత్తం ఊదా రంగులోకి మారుతుంది. వర్షాలు నిలిచిన తర్వాత లీటరు నీటికి 10 గ్రాముల 19 :19 :19 లేదా 20 గ్రాముల డీఏపీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి. పెసరలో నిలిచిన నీటిని తీసివేసిన తర్వాత ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటా ష్‌ను కలిపి చల్లాలి. అధిక తేమవల్ల ఆకులు పసుపు రంగుకు మారితే ఇనుపధాతు లోపంగా గుర్తించి 5 గ్రాముల అన్నభేదీ, 0.5 గ్రాముల నిమ్మ ఉప్పును లీటరు నీటికి కలిపి 4 నుంచి 5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసి నివారించవచ్చు.

-డాక్టర్ బీ. అనిల్ కుమార్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త

హామీలను అమలు చేయాలి

● టీయూజేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రపోల రామ్‌రెడ్డి



భువనగిరిలో సమావేశంలో మాట్లాడుతున్న ప్రపోల రామ్‌రెడ్డి

భువనగిరి గంజ్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టీయూజేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రపోల రామ్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భువనగిరి జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వ హించిన తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో ఆయన మా ట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. టీయూ జేఏసీ జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టోఫర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తుల్జారెడ్డి, చంద్రన్న ప్రసాద్, బట్టురాంచంద్రయ్య, కంచర్ల బద్రిమంచాల వెంకటస్వామి, ఎర్ర జాన్సన్, జహంగీర్, శ్రీను పాల్గొన్నారు.

కోదాడ విద్యార్థినికి ఐఐటీ హైదరాబాద్‌లో సీటు

కోదాడరూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి) : కోదాడ కొమరబండ తేజ విద్యాలయ పూర్వ విద్యార్థిని ఉస్తేల శ్రీ మహా ఐఐటీ హైదరాబాద్‌లో మాస్టర్స్ ఆఫ్ డిజైన్‌లో సీటు సాధించారు. తన బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ అహ్మదాబాద్‌లోని ప్రతిష్టాత్మకమైన కర్ణావతి విశ్వవిద్యాలయంలోని యూనైటెడ్ వరల్డ్ కాలేజ్ ఆఫ్ డిజైన్ కళాశాలలో పూర్తి చేశారు. స్వశక్తితో చదివి కేవలం 15 సీట్లు మాత్రమే గల ఇండస్ట్రియల్ ప్రొడక్ట్ డిజైన్ (మాస్టర్స్ డిజైన్) కోర్సులో సీటు సాధించిన శ్రీ మహాను తల్లిదండ్రులు రమాదేవి, సోమిరెడ్డి (తేజ విద్యాలయ చైర్‌పర్సన్) అభినందించారు. భవిష్యత్తులో పారిశ్రామిక ఉత్పత్తులకు మంచి రూపకల్పన చేయడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా విద్యార్థి చెప్పారు.

యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో యాదగిరికొండపై రద్దీ నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు, రాజధాని (హైదరాబాద్) నగరంలో బోనాల పండుగ ఉన్నా ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు వాహనాలపై తరలివచ్చారు. సుమారు 30వేల మంది భక్తులు క్షేత్ర దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక దర్శన క్యూలైన్లో రద్దీ, బ్రేక్ దర్శనం, ఆరగింపు సమయాల్లో భక్తులు క్యూలైన్లో వేచి ఉన్నారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.31,32,463 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వెంకట్రావ్ తెలిపారు. యాదగిరికొండపై హరిహరులకు నిత్యపూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కాగా, తెలంగాణ హైకోర్టు జస్టిస్ టి.మాధవి కుటుంబ సమేతంగా స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. వేద మండపంలో పండితులు వారికి వేదఆశీర్వచనం చేసి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. వేకువజామున సుప్రభాతం నిత్యారాధనలు ఆరంభించిన అర్చకులు రాత్రివేళ మహానివేదన, శయనోత్సవ పర్వాలతో ఆలయం ద్వారా బంధనం చేశారు. అంతకముందు గర్భాలయం స్వయంభువులకు అభిషేకం అర్చనలు ప్రాకార మండపంలో నిత్యహోమం కల్యాణోత్సవ పర్వాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ ఆలయంలో పాతగుట్టలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శివాలయంలో పర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి స్ఫటిక లింగానికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు

సేవలో పారదర్శకతకు కమిటీల ఏర్పాటు

యాదగిరిగుట్ట దేవస్థానంలో భక్తులకు మరింత పారదర్శకత సేవలు అందించేందుకు కొత్తగా కమిటీలు నియమిస్తున్నట్లు దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో ఎస్.వెంకట్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం, ప్రసాదం, అన్నదానం, క్రౌడ్ మేనేజ్‌మెంట్, భద్రత, శానిటేషన్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, రెవెన్యూ, విద్య, అకౌంట్ తదితర విభాగాల్లో పారదర్శకత పెంపునకు, నిర్వహణ లోపాల నివారణకు, అంతర్గత ఆడిట్ నిర్వహణ, భక్తులు, స్థానికుల నుంచి ఫిర్యాదులు రాకుండా సేవలందించడం కమిటీల విధులు అని పేర్కొన్నారు. ఆయా విభాగాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ భక్తుల సేవలో లోపాలు, కావాల్సిన సౌకర్యాలు గుర్తిస్తూ తగు సూచనలు, సరైన సలహాలు ఇస్తారని వివరించారు. అధికారులు, సిబ్బందిని ఈవో అధ్యక్షతన కమిటీ సభ్యులుగా నియమించినట్లు వివరించారు. కాగా, భక్తులు మెరుగైన భద్రత కల్పించేందుకు కొండపైన కంట్రోల్ రూంలో సీసీ కెమెరాలు మానిటరింగ్ సిస్టం, వాటి పనితీరును పరిశీలించి ఎస్పీఎఫ్. హోంగార్డ్ సిబ్బంది తగు సూచనలు, సలహాలు



కొండపైన ఆండాళ్ అమ్మవారి ఊరేగింపు

వైభవంగా తిరునక్షత్రోత్సవాలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసి ంహస్వామి వారి దివ్య క్షేత్రంలో చూడికుడుత నాచ్చియార్ (శ్రీ ఆండాళ్) తిరు నక్షత్రోత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఆలయంలో రెండో రోజు ఆదివారం ఉదయం ఆండాళ్ అమ్మవారికి స్నపనం, సాయంత్రం తిరువీధి సేవను ఊరేగిం చారు. ఆలయ ప్రధాన అర్చకులు, ఉప ప్రధానార్చకులు, ఆలయ అధ్యాపకుడు, అధికారులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో భక్తిశ్రద్ధలతో లక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి లక్ష్మీ నరసింహుని క్షేత్రంలో ఆదివారం స్వామివారి నిత్య కల్యాణాన్ని వేదపండితులు కన్నుల పండువగా అత్యంత వైభవంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు .అనంతరం భక్తులకు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు..

లవ్, లిక్కర్, ల్యాండ్ వివాదాలతో పెరుగుతున్న నేరాలు

● మానవ సంబంధాల పెంపునకు రచయితలు కృషి చేయాలి ● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్

భువనగిరి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): లవ్, లిక్కర్, ల్యాండ్ వివాదాలతో నేరాలు పెరుగుతున్నాయని, ప్రతిరోజు దినపత్రికలు, టీవీ చానల్స్‌లో 25 శాతం క్రైమ్ వార్తలే ఉంటుండటం ఆందోళన కలిగిస్తున్న అంశమని హైకోర్టు జస్టిస్ న్యాయమూర్తి కూనూరు లక్ష్మణ్ అన్నారు. జిల్లా రచయితల సంఘం, సాహిత్య సంస్థలు సంయుక్తంగా ఆదివారం భువనగిరిలో నిర్వహించిన ప్రముఖ కవి డాక్టర్ సి.నారాయణ రెడ్డి (సినారె) 94వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లల బాధ్యతరాహిత్యంతో వృద్ధ తల్లిదండ్రులు తమ పోషణ కోసం కోర్టులను ఆశ్రయిస్తున్నారని, దీంతో హైకోర్టులోని తన బెంచ్ పైకి ప్రతి రోజు ఇలాంటి 15 కేసులను వస్తున్నాయని, కింది కోర్టులలో ఆ సంఖ్య ఎక్కువగా ఉంటుందన్నారు. నేడు వృద్ధాశ్రమాలు పెరుగుతున్నందున 1972లో సినారె రాసిన ఆత్మీయత, అనుబంధం అంతా ఓ బూటకం అనే సినిమా పాట నిజమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సాహితీవేత్తలు, కవులు తమ రచనల ద్వారా మానవ సంబంధాలను బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. రచయితలకు, సమాజానికి విడదీయలేని బంధం ఉందని, మూడేళ్ల అనంతరం ఉద్యోగ విరమణతో తాను కూడా పూర్తిస్థాయి రచయితగా మారుతానని, సినారెకి తాను వీరాభిమానినని అన్నారు. తెలుగు భాషాభివృద్ధికి అందరూ కృషి చేయాలని, ఎంపిక చేసిన 2200 కోర్టు తీర్పుల తెలుగు అనువాదం 80 శాతం పూర్తయిందన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ఉన్న చతురత మరే భాషలో లేదన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ వర్తమాన సాహిత్యం దారి తప్పుతోందని, మానవ. సామాజిక ప్రయోజనాల కోసం రచనలు ఉండాలన్నారు. పురస్కారాలు కవులను ఉత్తేజపరుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య మాట్లాడుతూ తెలంగాణ పదాలకు ఆధునిక సాహిత్య వన్నెను అద్దిన ఘనుడు సినారే అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 11 మంది సాహితీవేత్తకు సినారె రాష్ట్ర స్థాయి సాహిత్య పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సద్ది వెంకట్ రెడ్డి, రచయితల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, బండారు జయశ్రీ, సాహితీవేత్తలు బండిరాజుల శంకర్, శెట్టి బాలయ్య యాదవ్ పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి తదితరులు

సినారె పురస్కార గ్రహీతలు వీరే..

- ఏనుగు నరసింహారెడ్డి (ఉమ్మడి నల్లగొండ)
- అమ్మంగి వేణుగోపాల్ (ఉమ్మడి రంగారెడ్డి)
- గన్నమరాజు గిరిజా మనోహరబాబు (ఉమ్మడి వరంగల్)
- కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి(ఉమ్మడి మహబూబ్ నగర్)
- వంశీకృష్ణ (ఉమ్మడి ఖమ్మం)
- డాక్టర్ దామెర రాములు (ఉమ్మడి ఆదిలాబాద్)
- కందుకూరి శ్రీరాములు (ఉమ్మడి మెదక్)
- డాక్టర్ శంకర (ఉమ్మడి నిజామాబాద్)
- నెల్లుట్ల రమాదేవి (ప్రత్యేక పురస్కార గ్రహీత)

కార్గిల్ అమరవీరులకు నివాళులు



ఆత్మకూరు(ఎం)లో కార్గిల్ అమరవీరులకు కొవ్వొత్తుల దీపాలతో నివాళులర్పిస్తున్న యువజన సభ్యులు

ఆత్మకూరు(ఎం), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : దేశరక్షణ కోసం ప్రాణత్యాగాలు చేసిన సైనిక అమరవీరులకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలోని నేతాజీ, శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో సభ్యులు శనివారం రాత్రి కొవ్వొత్తుల దీపాలు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన 527 మంది వీర సైనికుల మరణం ఈ దేశం ఎన్నడూ మర్చిపోదన్నారు. సైనిక అమరవీరులకు జోహర్లు అర్పించారు. కార్గిల్ విజయంతో భారతదేశ శక్తి ప్రపంచ దేశాలకు తెలిసి వచ్చిందన్నారు. ఇటీవల జరిగిన పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ చేసిన దాడిలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలు ధ్వంసమయ్యాయన్నారు.. ఈ కార్యక్రమంలో నేతాజీ , శివాజీ యువజన సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, మహేందర్ రెడ్డి, మజ్జిగ నరేష్, అనిల్ పాల్గొన్నారు.

కొండెక్కిన కొబ్బరి

● పెగిరిన టెంకాయ ధరలు ● బెంబేలెత్తుతున్న భక్తులు

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

అసలే శ్రావణం, ఆ పైన బోనం.. వరాలిచ్చే వరలక్ష్మి వ్రతం, అన్నాచెల్లెళ్ల అనుబంధ ప్రతీక రాఖీ.. ఇవన్నీ పండుగలే.. అంతెందుకు శుభప్రద మాసమని పిలిచే శ్రావణంలో ప్రతి రోజూ పండుగే.. ఇన్ని పండుగలున్న మాసంలో ఎన్ని కొబ్బరికాయలు కావాలి, మరెన్ని టెంకాయలు కొట్టాలి అయితే ఈ సీజన్‌లో అదందరితో సాధ్యం కాకపోవచ్చు. ఎందుకంటారా.. కొబ్బరి కాయల ధరలు కొండెక్కాయి.

● టెంకాయ ధర అదరహో..

మునుపెన్నడూ లేని విధంగా కొబ్బరికాయ ధరలు పెరుగుతున్నాయి. పచ్చి కాయలు ధరలు ఆకాశాన్నంటడంతో టెంకాయల ధర మండిపోతోంది. అందుకు కారణాలెన్నో ఉన్న ప్రధానమైనవి రెండే.. అందుట్లో ఒకటి పంట దిగుబడి తగ్గడమైతే, మరొ కారణం కొబ్బరి బోండాలకు డిమాండ్ పెరగడం. కొబ్బరి సాగు అధికంగా పండించే కర్నాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల్లో దిగుబడి గణనీయంగా తగ్గడంతో కాయలకు డిమాండ్ బాగా పెరిగింది. దీంతో హోల్ సేల్‌గానే ధర పెరగడంతో సాధారణ, సన్న రకాల కాయల ధర రూ. 25 నుంచి 30వరకు పలుకుతుండగా, మోస్తారు, లావు టెంకాయ ధర రూ. 35 నుంచి రూ.40 పలుకుతోంది.

● దిగుబడి తగ్గడంతో..

పంట దిగుబడి తగ్గడంతోనే కొబ్బరి కాయల ధర పెరిగినట్లు వ్యాపారులంటున్నారు. కొబ్బరి సాగు కర్ణాటక రాష్ట్రంలో ఎక్కువగా ఉండగా, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తర్వాత స్థానాల్లో ఉన్నాయి. కర్నాటకలో పంట సాగు గణనీయంగా తగ్గగా, కేరళలో వరదల కారణంగా పంట నష్టం జరిగింది. ఇక తమిళనాడులో కొబ్బరి చెట్లకు చెద వచ్చి పంట దిగుబడి కాలేదు. ఇక కోనసీమలో అరకొరగా పండిన పంటలో సగభాగం కొబ్బరి బోండాలుగా విక్రయిస్తున్నారు. మిగతా సరుకుని ధర పెంచి విక్రయిస్తుండగా, కొందరు దళారులు వినాయక చవితి, దసరా, దీపావళి పండుగల కోసం అటకలపై(అదో రకమైన నిల్వ చేసే విధానం) ఉంచుతున్నట్లు మార్కెట్‌లో ప్రచారం జరుగుతోంది.

● బొండాలు తెగ తాగుతుండటంతో..

కొబ్బరి బొండాల విపరీత వినియోగం టెంకాయల ధర పెరుగుదలకు ప్రధాన కారణంగా చెప్పొచ్చు. పోషకల విలువలు అధికంగా ఉన్న కొబ్బరి బోండాలను తాగాలని, వైద్య నిపుణులు సూచిస్తుండడంతో కరోనా అనంతరం కొబ్బరి బొండాల వినియోగం మరింతగా పెరిగింది. ఒక్కో బొండం ధర రూ. 50కి తక్కువగా (ఏ సీజన్‌లో అయినా) ఉండటం లేదు. ఇక లీటర్ కొబ్బరి నీళ్ల ధర రూ.130 నుంచి 150గా ఉంటోంది. ఈ నేపథ్యంలో కొబ్బరి రైతులు పచ్చిగా, లేతగా ఉండగానే బోండాల వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఎక్కడో మిగిలినవి, ఎత్తుగా పెరిగి కోతకు అందకుండా ఉన్న వాటిని కొబ్బరి కాయలుగా విక్రయిస్తున్నారు.



హోల్‌సేల్ దుకాణంలో కొబ్బరికాయలు

● హోల్‌సేల్‌గానే అధిక ధరలు..

కొబ్బరి కాయలను కొన్ని ప్రాంతాల్లో తూకంతో, మరి కొన్ని ప్రాంతాల్లో పీసులుగా అమ్ముతారు. కేరళ, తమిళనాడులో కిలో ధర రూ. 40 పలుకుతుండగా, ఏపీలోని కోనసీమ, కర్నాటక రాష్ట్రంలో కొత్త కొబ్బరి వెయ్యి కాయల రూ. 24వేలు పలుకుతుండగా, పాత కాయల ధర రూ. 26కు చేరినట్లు హోల్‌సేల్ వ్యాపారులు వాపోతున్నారు. రవాణా, పొట్టుతీత తదిర ఖర్చులుంటాయంటున్నారు దుకాణాదారులు. గతంలో టన్నుల కొద్దీ దిగుమతి చేసుకునే వారమని, ధర ఎక్కువగా ఉన్న కారణంగా నలుగురైదుగురం కలిసి లోడు తెప్పించుకుంటున్నామని టెంకాయల హోల్ సేల్ వ్యాపారులు.

● చుండూరు శ్రీనివాస్‌గుప్తా, మిర్యాలగూడ

భక్తులకు భారం కాకుండా చూడాలి



ఆధ్యాత్మిక అవసరాలలో కొబ్బరి కాయలది ప్రత్యేక స్థానం. ఇటీవల కాలంలో కొబ్బరి కాయల ధరలు బాగా పెరుతున్నాయి. బోండాలది అదే పరిస్థితి. కొబ్బరి చెట్టులో వృథాగా పోయేది ఏదీ ఉండదు. పచ్చి కొబ్బరి, ఎండు కొబ్బరి, బొండాం, కాండం, ఆకులు, పిందెలు, పుల్లలు అన్నింటికీ డిమాండ్ బాగానే ఉంటుంది కదా.. ఇంత డిమాండ్ ఉన్న పంటను సాగు చేసేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరముంది. ముందుగా కొబ్బరికాయల ధరలు తగ్గించాలి.

- చుండూరు శ్రీనివాస్‌గుప్తా డాక్టర్స్‌కాలనీ, మిర్యాలగూడ.


● వ్యాపారం కష్టతరంగా మారింది.



హోల్‌సేల్‌గానే కొబ్బరి కాయల ధరలు పెరగడంతో గిరాకీ పడిపోయింది. కోనసీమలో కాయ ధర రూ. 25, 26 పడుతోంది. తమిళనాడులో కిలో ధర. రూ.44గా ఉంది. గతంలో పోటీలు పడి సరుకు పంపే వారు ప్రస్తుతం పలు మార్లు అడిగినా దిగుమతి లేని కారణంగా పంపలేని పరిస్థితి ఉంది. పెరుగుతున్న ధరలతో వ్యాపారం కష్టతరంగా మారింది. లాభాల మాట అటుంచితే నష్టాలు రాకుంటే చాలన్నట్లుగా వ్యాపారం చేస్తున్నాం. .

- ఎస్.సుబ్బారావు (హోల్‌సేల్ కొబ్బరి కాయల వ్యాపారి, మిర్యాలగూడ)

చెస్‌లో కోదాడ విద్యార్థుల ప్రతిభ



బహుమతులతో 'తేజ' పాఠశాల విద్యార్థినులు

కోదాడ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కొమరబండ తేజ విద్యాలయం విద్యార్థులు చెస్‌లో ప్రతిభ చూపారని పాఠశాల ప్రిన్సిపాల్ రమా సోమిరెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. తెలంగాణ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయిలో చదరంగం పోటీలు నిర్వహించా రన్నారు. ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థిని యోగిత అండర్-13, 5వ తరగతి విద్యార్థిని అద్వైత అండర్-11 కేటగిరీల్లో ద్వితీయ బహుమతి సాధించారన్నారు.

కలాం జీవితం స్ఫూర్తిగా తీసుకోవాలి

భువనగిరి రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): భారత రత్న , మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జీవితాన్ని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని సామాజిక వేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ అన్నారు. కలాం వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో భారత రత్న అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేడు శాలిగౌరారంలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

శాలిగౌరారం, జూలై 27(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారంలోని జీబీఎం ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పార్టీ మండల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్ ఆదివారం తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నిర్వహించే ఈ సన్నాహక సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొనాలని వెంకన్న కోరారు.

ఆర్థిక సాయం అందజేత

నార్కట్‌పల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన విక్రమ్ ఇటీవల మృతి చెందారు. విక్రమ్ కుటుంబానికి స్థానిక నాయకులు కొందరు రూ.10 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బానాల భాస్కర్‌రెడ్డి, పుల్లెంల మహేష్, జొన్నలగడ్డ రాజశేఖర్‌రెడ్డి, మేరెడ్డి శంకర్‌రెడ్డి, వడ్డేగోని రామలింగం, అలుగుబెల్లి నర్సిరెడ్డి, కొప్పు ప్రవీణ్, అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రాణసంకటం

- రహదారులపై గుంతలు
- పట్టించుకోని అధికారులు



దర్వేశిపురం గ్రామ రహదారి దుస్థితి



బుడమర్లపల్లిలో రోడ్డుపై ఏర్పడిన గోతులు

కనగల్, జూలై27(ఆంధ్రజ్యోతి): మండలంలో రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. కనగల్ మండలంలోని బుడమర్లపల్లి గ్రామం వద్ద కనగల్ - చండూరు ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతుల్లో వర్షం నీరు చేరి చిన్నపాటి కుంటలను తలపిస్తున్నవి. వాహనాలు ఈ గుంతల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో ప్రయాణమంటేనే ప్రాణ సంకటంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఇక్కడ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు గుంతలను పూడ్చి మరమ్మతులు చేయకుండా అలసత్వం వహిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రీతిలో దర్వేశిపురం గ్రామానికి వెళ్లే రహదారి కూడా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నది. రోడ్డంత బురదమయంగా మారి వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తరగతికొక్కరు.. ముచ్చటగా ముగ్గురు

- జువ్విగూడెం పాఠశాలకు విద్యార్థులు కరువు
- ఉపాధ్యాయుడు కూడా ఒక్కడే
- మీటింగ్ ఉన్నా... సెలవు పెట్టినా బడి బంద్





ముగ్గురు విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు (ఫైల్), జువ్విగూడెం ఎంపీపీఎస్ భవనం

నార్కట్‌పల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాలలో తరగతికి ఒక్కొక్కరు చొప్పున ముచ్చటగా ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. 1,2,3వ తరగతులకు ఒక్కొక్క విద్యార్థి చొప్పునే ఉన్నారు. అలాగనీ ఉపాధ్యాయులు కూడా ఎక్కువేమీ లేరు. ఆయన కూడా ఒక్కడే. నార్కట్‌పల్లి మండలంలోని జువ్విగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పరిస్థితి. పాఠశాలకు విద్యార్థులు కరువయ్యారు. ఈ మాత్రం సంఖ్య కూడా ఉందంటే పాఠశాల ఉపాధ్యాయుడు వెళ్లి తల్లిదండ్రులను ఒప్పిస్తేనే వారు పంపిస్తున్నారు. సంఖ్య తక్కువగా ఉండటానికి జువ్విగూడెంలో ఉన్న విద్యార్థులు ఎక్కువగా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లడం అదేవిధంగా గ్రామ పంచాయతీ మధిర గ్రామమైన కృష్ణపురం కాలనీ విద్యార్థులు ఎక్కువగా పక్కనే ఉన్న తొండ్లాయి పాఠశాలకు వెళ్తుండటమే కారణం. జువ్విగూడెం పాఠశాలకు ఇరువైపులా సుమారు 2 కిలోమీటర్ల దూరంలోనే తిరుమలగిరి, వెంకటేశ్వర్లబావి గ్రామాల్లో ఎంపీపీఎస్‌లు ఉన్నాయి. దీంతో ఈ పాఠశాలకు విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం లేదు. కృష్ణాపురం కాలనీవాసుల పిల్లలను జువ్విగూడెంలోనే చేర్పిస్తే కొంచెం సంఖ్య పెరగనుంది. పైగా ఏకోపాధ్యాయ పాఠశాల కావడంతో ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు అధికారిక సమావేశానికో లేదా వ్యక్తిగత సెలవుపైనో వెళితే ఆ రోజు పాఠశాలకు సెలవు ఇచ్చినట్టే.

సంఖ్య పెరగకుంటే ఆలోచిస్తాం

జువ్విగూడెం ఎంపీపీఎస్‌లో విద్యార్థుల సంఖ్య ముగ్గురు మాత్రమే ఉన్న విషయాన్ని ఎంఈవో కూకుట్ల నర్సింహ దృష్టికి తీసుకుపోగా బడిబాట నిర్వహించినా ఎవరూ రాలేదని తెలిపారు. కొన్ని రోజులు వేచిచూసి అప్పటికీ సంఖ్య పెరగకపోతే ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

పొనుగోడులో సవార్ల పండుగ

- దట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

కనగల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొనుగోడు గ్రామంలో సవార్ల పండుగను ఆదివారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ మెరుగు శివయ్య ఆధ్వర్యంలో ఆలీహుస్సేన్ షైబు హుస్సేన్ చినకాశీం, పెదకాశీం సవార్లను డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా ఇంటింటికి తిప్పారు. సవార్లకు భక్తులు నీళ్లారబోసి మెరుపు గుడ్డలను కట్టారు. గ్రామస్థులు బొంగులు, కుడకలు, బెల్లం, కట్న కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏకాలపు లక్ష్మయ్య, ముజావర్లు ఏకాలపు అంజయ్య, మెరుగు షైబూలు, సందు లింగయ్య, తోకల భిక్షం పాల్గొన్నారు.



పొనుగోడు గ్రామంలో సవార్ల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు

గంజాయి, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

- డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్
- గట్టుప్పల్‌కు చేరుకున్న సైకిల్‌యాత్ర



గట్టుప్పల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లం మహేష్

గట్టుప్పల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లం మహేష్ అన్నారు. గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్‌లను అరికట్టాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ చైతన్య సైకిల్‌యాత్ర ఆదివారం గట్టుప్పల్ మండలకేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రోజురోజుకు గంజాయి, డ్రగ్స్ వాడకం పెరుగుతుందని, వాటి బారిన పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగుల ద్వారా లక్షల రూపాయలు పోగొట్టుకొని అనేక మంది అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు వీటిని పూర్తిగా అరికట్టాలన్నారు. గంజాయి, డ్రగ్స్ మనిషిని విచక్షతను కోల్పోయే విధంగా చేస్తోందని, ఆ మైకంలో అనేక నేరాలు చేస్తున్నారని అన్నారు. అనంతరం ఏఎస్ఐ అంజయ్య మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి తీసుకున్నా, వాటిని రవాణా చేసిన కొంతమందిని గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చి చట్టపరంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తమ పిల్లలు చేసే పనులను తల్లిదండ్రులు పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి అధ్యక్షతన నిర్వహించిన సభలో సైకిల్‌యాత్ర సభ్యులు పుల్లెంల శ్రీకర్, వడ్డగాని మహేష్, గుండాల నరేష్, రాజేష్, చంద్రశేఖర్, గోపి, సంఘం మండల అధ్యక్షుడు టేకుమట్ల కృష్ణ, నాయకులు రావుల వెంకన్న, పరసగోని నితిన్, వ్యకాస మండల కార్యదర్శి కర్నాటి సుధాకర్, వివిధ సంఘాల నాయకులు కర్నాటి వెంకటేశం, కర్నాటి యాదయ్య, నరసింహ, బుచ్చిరెడ్డి, గోలి బిక్షం తదితరులు పాల్గొన్నారు.

బోనాలు తెలంగాణ సంస్కృతిలో భాగం

కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడి జయంత్



శ్రావణమాస తొలి బోనాలతో తరలివస్తున్న మహిళలు

కనగల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): గ్రామదేవతలకు బోనాలు సమర్పించటం తెలంగాణ సంస్కృతిలో భాగమని కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడి జయంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మ ల్కాజిగిరి దయానందరావు అన్నారు. కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో శ్రావణ తొలిబోనాలను ఘనంగా సమర్పించారు. డప్పుచప్పుళ్లు, సన్నా యి వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాల నడుమ 201 బోనాలతో మహిళలు, సంఘం నాయకులు ఊరేగింపుగా ఆలయం వద్దకు తరలివచ్చారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం భక్తిశ్రద్ధలతో ఇష్టదైవానికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కరువు కాటకాలు దరిచేరకుండా గ్రామాలను కాపాడాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. వ చ్చే ఏడాది అయిదు వందల బోనాలతో తిరిగొస్తామని మొక్కుకున్నారు. బోనాల సమర్పణకు హాజరైన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. మొదటగా బోనాల ఊరేగింపును ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి ప్రారంభించారు. అంతకుముందు ఆలయ సమీపంలో జరిగిన సమావేశంలో కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడి జయంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానందరావు మాట్లాడుతూ కుమ్మరి కులస్థులకు గ్రామ దేవతాలయాల వద్ద తగు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. అనాదిగా కుమ్మరి కులస్థులు సామాజిక వివక్షతను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కుమ్మరులకు పెద్దపీట వేయాలన్నారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏడుకొండల వెంకటేశం, బోనాల కమిటీ చైర్మన్ ఏడుకొండల సత్యవతి, వైస్ చైర్మన్లు రాదారపు బిక్షపతి, గంగాధర వెంకటేశ్వర్లు. రాచకొండ కిష్టయ్య, గంగాధర రామ్మూర్తి, జిల్లా కోశాధికారి దశరథ, శ్రీనివాస్, ఆమంచి శరత్, బొడ్డుపల్లి లక్ష్మీ, నీలకంఠం యాదయ్య, నరేందర్, బిక్షం, మంజు ల, నీలకంఠం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

- గుడి ప్రహారీ నిర్మాణానికి ఆర్థిక సాయం



గుడి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న నర్సిరెడ్డి

శాలిగౌరారం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మం డలం బైరవునిబండ గ్రామంలో యాదవుల ఆరాధ్య దైవమైన గంగ దేవమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించాలని యాదవ సం ఘం కోరారు. ఆదివారం గ్రా మానికి చెందిన ఏమిరెడ్డి నర్సిరెడ్డి -మంగ దంపతులు గంగదేవమ్మ గుడి ప్రహారీ గోడ నిర్మాణానికి రూ.50,116 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ పెద్దలు ఏమిరెడ్డి నర్సిరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం ప్రతినిధులు పెద్ద గొల్ల సంకటి రమేష్, సారె గొల్ల బీసం నర్సింహ, కడారి మల్లయ్య, సంకటి శంకర్, మెరుగు ముత్తయ్య, పులిచెర్ల రవి తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ రికగ్నైజేషన్‌తో ఇక ఆసరా పెన్షన్

(5వ పేజీ తరువాయి)

పరికరం గుర్తించక పెన్షన్ల పంపిణీలో ఆలస్యం జరిగేది. దీంతో వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలు ఉన్న పెన్షన్‌దారులు గంటల తరబడి పోస్టాఫీసుల వద్ద వేచి ఉండాల్సి వచ్చేది. ఎండాకాలంలో అయితే కొందరు స్పృహతప్పి పడిపోగా వర్షాకాలంలో తడుస్తూ పెన్షన్‌దారులు ఇబ్బందులు పడేవారు. అవురవాణి లాంటి కొన్ని మారుమూల గ్రామాల్లో పీవీటీడీ పరికరానికి నెట్ సిగ్నల్స్ అందక డాబాలపైకి ఎక్కి పెన్షన్‌దారులు వేలిముద్రలు ఇచ్చే పరిస్థితి ఇప్పటికీ ఉంది. ఒక్కో పెన్షన్‌దారుడికి కనీసం 2 నుంచి 5 నిమిషాల సమయం పట్టేది. కానీ సరికొత్త ఫేస్ రికగ్నైజేషన్ విధానంతో సిగ్నల్ సమస్య ఉండదు. కేవలం 5 సెకన్లలోపే పెన్షన్ ఇచ్చే సాంకేతిక పరిజ్ఞానం ఇందులో ఉంది.

అక్రమాలకు చెక్

ఫేస్ రికగ్నైజేషన్ విధానంతో అక్రమాలకు చెక్ పడనుంది. గతంలో కొందరు రాజకీయ ఒత్తిడితో స్థానికంగా ఉండని వారి అనుచరుల పెన్షన్లను పంచాయతీ కార్యదర్శుల ద్వారా పొందినట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇకపై ఇలాంటి అక్రమాలకు చెక్ పడినట్టే. నేరుగా పెన్షన్‌దారుడు యాప్‌లో ముఖం చూపి, కనురెప్పలు కొట్టడం ద్వారా పెన్షన్ ఇచ్చే విధానంతో నేరుగా పెన్షన్ దారుడికే డబ్బు అందనుంది.

బీపీఎంలకు కొత్త స్మార్ట్ ఫోన్లు

ఫేస్ రికగ్నైజేషన్ యాప్ విధానం అమలు కోసం రాష్ట్రంలోని సుమారు 6వేల మంది ఉన్న బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌లకు 5జీ సామర్థ్యం కలిగిన కొత్త స్మార్ట్ ఫోన్‌లను, డివైజ్‌లను అందించనున్నట్లు తెలిసింది. పూర్తి సెర్ప్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌ను ఫోన్‌లో సెర్ప్‌కు చెందిన టెక్నికల్ టీం ద్వారానే లోడ్ చేసి ఇవ్వనున్నారు. కేవలం 2 నుంచి 5 సెకన్ల లోపే యాప్ ద్వారా పెన్షన్ పొందే సాంకేతికతను పొందుపర్చారు. ఇప్పటికే ఈ విధానంపై బీపీఎంలకు అవగాహన కల్పించారు.

ఆరుసార్లు గుర్తించకపోతే

సరికొత్త విధానం ద్వారా ఏ పెన్షన్‌దారుడి ముఖాన్ని యాప్ గుర్తించలేని పక్షంలో ప్రత్యామ్నాయంగా పాత పద్ధతిలో వేలిముద్ర వేయించి ఇచ్చేలా వెసులుబాటు కల్పించారు. స్మార్ట్ ఫోన్‌లో యాప్ లాగిన్ అయిన తర్వాత పెన్షన్‌దారుడి పోస్టల్ అకౌంట్ నెంబరును నమోదు చేస్తారు. వెంటనే ఫోన్‌లో సదరు లబ్ధిదారుడి వివరాలు వస్తాయి. అనంతరం ఫేస్ రికగ్నైజేషన్ విధానంలోకి వెళ్తారు. కంటి రెప్పలను బ్లింకింగ్ చేయడం ద్వారా వివరాలు సరైనవే అయితే పెన్షన్ డబ్బు ఎంతో చూపిస్తుంది. లేదంటే ఎర్రర్‌గా పేర్కొంటుంది. ఇలా ఆరుసార్లు కూడా ఎర్రర్ వస్తే సదరు పెన్షన్‌దారుడికి పాత వేలిముద్ర సేకరణ పద్ధతిలోనే పెన్షన్ ఇచ్చే వీలు కల్పించారు.

రోగుల పెన్షన్లు ఎలా?

కొత్త విధానం బాగానే ఉన్నా మంచానికే పరిమితమైన పెన్షన్‌దారుల పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. అతంలో పెన్షన్‌దారుడు మంచానికే పరిమితమైన లేదా దివ్యాంగుడైనా, బయోమెట్రిక్‌లో వేలిముద్ర పడకపోయినా పంచాయతీ కార్యదర్శి వేలిముద్రతో సంబంధిత పెన్షన్‌దారుడికి డబ్బు ఇచ్చే అవకాశం ఉండేది. కానీ ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ప్రవేశపెట్టాక పంచాయతీ కార్యదర్శులతో సంబంధం ఉండదు. దీంతో మంచానికే పరిమితమైన రోగి ఇంటికి పోస్టల్ సిబ్బంది వెళ్లి పెన్షన్ పంపిణీ చేయాలని ప్రస్తుతానికి ఆదేశాలు ఉన్నాయి. అయితే ఇళ్లకు వెళ్లి పెన్షన్ ఇచ్చే విధానంపై పోస్టల్ సిబ్బంది అభ్యంతరం చెబుతున్నారు. పెన్షన్ డబ్బు ఉన్న బ్యాగును చేత పట్టుకుని ఇళ్లకు వెళ్తే భద్రతాపరంగా ఇబ్బందులు ఎదురవుతాయని పోస్టల్ సిబ్బంది పేర్కొంటున్నారు.

రాష్ట్రమంతా ఇదే విధానం

బహుళ ప్రయోజనాలు ఉండే ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా ఆసరా పెన్షన్లు ఇచ్చే విధానం రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశపెట్టనున్నాం. ఈ మేరకు ప్రభుత్వం కూడా ఆదేశాలు, సూచనలు జారీ చేసింది. సెర్ప్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన యాప్ పనితీరును పరిశీలించేందుకు సంగారెడ్డి జిల్లాలోని ఓ మండలంతో పాటు జిల్లాలో నార్కట్‌పల్లి మండలాన్ని ఎంపిక చేసుకున్నాం. యాప్ ద్వారా ఆసరా పెన్షన్లు ఇచ్చే ప్రయోగాత్మక విధానం అమ్మనబోలులో విజయవంతమైంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 22లక్షల మంది ఆసరా పెన్షన్‌దారులకు ఇదే విధానంలో పెన్షన్ ఇవ్వనున్నాం.

\- కర్నాటి గోవర్ధన్, సెర్ప్ అదనపు డైరెక్టర్

సమస్యల పరిష్కారంలో విఫలం

- బీజేపీ రాష్ట్ర నాయకుడు రామరాజుయాదవ్

తిప్పర్తి, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, నల్లగొండ జిల్లాలో మంత్రి ఉన్నా కూడా అభివృద్ధి జరగడం లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు, తిప్పర్తి మండల ప్రభారి పిల్లి రామరాజుయాదవ్ అన్నారు. తిప్పర్తి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతున్నా గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్న కాశీవారిగూడెం, ఆరెగూడెం, కంకణాలపల్లి గ్రామాలకు ఇప్పటి వరకు రోడ్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా తిప్పర్తి మండలంలోని రైతులకు డి -40, 39 కాల్వల ద్వారా రావాల్సిన నీటిని ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో అందించకపోవడం బాధాకరమన్నారు. మండలానికి వచ్చే నీటిని నాయకుల అసమర్థత వల్ల ఇతర మండలాలకు తరలించుకుపోతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేయించేదాక బీజేపీ పోరాడుతుందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో వార్డు సభ్యుడి దగ్గర నుంచి జడ్పీటీసీ వరకు బీజేపీ అభ్యర్థులు పోటీ చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా కొన్నేళ్లుగా ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎంలకు ప్రజలు మద్దతు ఇచ్చారని, ఈ సారి ఎన్నికలలో బీజేపీ వైపు ప్రజలు చూస్తున్నారని అన్నారు. ప్రతీ కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి పార్టీ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తిప్పర్తి మండల కేంద్రంలో ఆదివారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు వంగూరి రవి ఆధ్వర్యంలో సుమారు 100కు పైగా ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కార్యకర్తలు డీజే సౌండ్ సిస్టమ్ వాహనాన్ని తీసుకొచ్చారు. గమనించిన పోలీసులు డీజే వాడటానికి అనుమతి లేదని దానిని తీసుకెళ్లారు. దీంతో ఆగ్రహించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు అద్దంకి-నార్కట్‌పల్లి ప్రధాన హైవేపై సుమారు 30 నిమిషాల పాటు రాస్తారోకో చేశారు. దీంతో రోడ్డుపై కిలోమీటరు మేర ట్రాఫిక్ జామ్ అయింది. పైస్థాయి అధికారులతో మాట్లాడిన స్థానిక పోలీసులు డీజే వాహనాన్ని తిరిగి వారికి అప్పగించడంతో రాస్తారోకో విరమించారు. ఈ సమావేశంలో మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు ఎస్కె. బాబా, నాయకులు గుండా వినయ్‌కుమార్, పల్లె ప్రకాశ్, నకిరేకంటి మహేష్, ధర్మబోయిన గంగాదర్, యాదగిరి, వడ్డె శ్రీనివాస్‌రెడ్డి, షైనం మల్లయ్య, బ్రహ్మాచారి, నాగరాజు, సాయికిరణ్‌రెడ్డి, పాపకంటి శివ, మేడబోయిన లింగస్వామి, మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్, మహేష్, చంద్రు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజుయాదవ్

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	583 (291.3795)	93,115	35,749
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.30 (4.02)	1,287.02	1,885.43
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	158.463 (23.8180)	26,281	400

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు	లైవ్ : రూ.137	డ్రెస్ : రూ.200	స్కిన్‌లెస్ : రూ.230



సాగర్‌లో.. విద్యుదుత్పత్తి షురూ

» ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి నీటిపారుదలశాఖ అనుమతి

» ఇప్పటికే ఎడమ కాల్వ జలవిద్యుత్ కేంద్రంలో ఒక టర్బైన్ ద్వారా విద్యుదుత్పత్తి

సాగర్ ప్రాజెక్టుకు ఈ ఏడాది నెల రోజుల ముందుగానే ఎగువ నుంచి వరదలు వచ్చి ప్రాజెక్టు పూర్తిస్థాయికి చేరువలో ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 25వ తేదీన ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభానికి నీటిపారుదలశాఖ అధికారులు అనుమతి ఇచ్చారు. దీంతో జెన్‌కో అధికారులు విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు.

-(ఆంధ్రజ్యోతి,నాగార్జునసాగర్)

సాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్‌లు ఉన్నాయి. అందులో మొదటి టర్బైన్ ఇండియాకు చెందిన బీహెచ్‌ఈఎల్ కంపెనీ రూపొందించింది. మిగిలిన ఏడు టర్బైన్‌లు జపాన్ టెక్నాలజీకి చెందినవి. అందులో బీహెచ్‌ఈఎల్ టర్బైన్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 110 మెగావాట్లు. మిగిలిన ఏడు టర్బైన్ల ఒక్కో దాని సామర్థ్యం 100.6 మెగావాట్లు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 815.6 మెగావాట్లు. కాగా, ఏటా ప్రధాన జలవిద్యుత్ కేంద్రం లక్ష్యానికి మించి విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఒక్క 2023-24లో మాత్రమే ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. అయితే ఈ ఏడాది జూన్ 30వ తేదీ నుంచే సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం మొదలైంది. 18 ఏళ్ల తర్వాత నెల రోజుల ముందుగానే జూలై నెలలోనే సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంది. దీంతో ప్రాజెక్టు అధికారులు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తికి ఈ నెల 25వ తేదీన అనుమతి ఇచ్చారు. అలాగే ఎడమ కాల్వ జలవిద్యుత్ కేంద్రంలో 30 మెగావాట్ల సామర్థ్యంతో రెండు టర్బైన్‌లు ఉన్నాయి. ఎడమ కాల్వకు ప్రస్తుతం 4వేల క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేస్తుండంతో ఒక్క టర్బైన్ ద్వారా మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. ఎడమకాల్వ పరిధిలోని ఈ జల విద్యుత్ కేంద్ర ద్వారా 24 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, ప్రధాన విద్యుత్ కేంద్రం ద్వారా ఒక మిలియన్ యూనిట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

క్రస్ట్ గేట్లు ఎత్తితే నీళ్లన్నీ సముద్రంపాలు

సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు ఎత్తితే నీళ్లన్నీ సముద్రం పాలవుతాయి. అలా వృథాగా నీరు పోకుండా ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తికి నీటిపారుదల శాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. దీంతో విద్యుదుత్పత్తి చేస్తున్నామని అధికారులు తెలిపారు.

ఐదేళ్లలో సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తి వివరాలు...

సంవత్సరం	లక్ష్యం (మి.యూ)	ఉత్పత్తి (మి.యూ)	వినియోగించిన నీరు (టీఎంసీల్లో)
2020-21	1290	1248.78	184.15
2021-22	1535	2262.52	335.37
2022-23	1500	2355.62	347.82
2023-24	1400	540.84	95.84
2024-25	1400	1922.26	283.90
2025-26	1450	210	36.77

ఐదేళ్లల్లో ఎడమ కాల్వ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ఇలా..

సంవత్సరం	లక్ష్యం (మి.యూ)	ఉత్పత్తి (మి.యూ)	నీటిమట్టం (అడుగుల్లో)
2020-21	60	101.17	590
2021-22	97	148.32	590
2022-23	60	140.05	590
2023-24	69	0	529
2024-25	69	86.32	590
2025-26	69	24	576

(ఈఆర్థిక సంవత్సరంలో జూలై 24వ తేదీ వరకు) 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రాజెక్టుకు వరద రాకపోవడంతో క్రాప్‌హాలిడే ప్రకటించారు. దీంతో ఎడమ కాల్వ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేయలేదు.

ఫేస్ రికగ్నైజేషన్‌తో
ఇక ఆసరా పెన్షన్

» రాష్ట్రవ్యాప్తంగా అమలుకు ప్రభుత్వం సన్నాహాలు » వేలిముద్రల విధానానికి త్వరలో స్వస్తి

» సమయం ఆదా, అక్రమాలకు చెక్ » పైలెట్ మండలంగా నార్కట్‌పల్లి » అమ్మనబోలులో ప్రయోగాత్మక చెల్లింపు సక్సెస్



అమ్మనబోలులో కొత్త యాప్ ద్వారా పెన్షన్ డబ్బులు అందజేస్తున్న సెర్ప్, పోస్టల్ అధికారులు, యాప్‌లో పెన్షన్‌దారుడి ఫేస్ రికగ్నైజేషన్ చేస్తున్న సిబ్బంది



ప్రభుత్వ విభాగాల్లో హాజరు నమోదు కోసం అమలులో ఉన్న ఫేస్ రికగ్నైజేషన్ (ముఖగుర్తింపు) యాప్ విధానాన్ని తాజాగా, ఆసరా పెన్షన్‌ల పంపిణీలోనూ అమలుచేస్తున్నారు. ఇంతకాలం వేలి ముద్రలు వేసి పెన్షన్ పొందిన ఆసరా పెన్షన్‌దారులు ఇకపై ఫేస్ రికగ్నైజేషన్ హాజరు ద్వారా డబ్బు అందుకోనున్నారు. మున్ముందు వేలిముద్రల విధానానికి క్రమంగా స్వస్తి పలకనున్నారు. ఈ విధానంతో సమయం ఆదా కావడంతో పాటు పెన్షన్ పంపిణీలో అక్రమాలకు చెక్ పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,నార్కట్‌పల్లి)

సెర్ప్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఫేస్ రికగ్నిజేషన్ యాప్ అమలుకు జిల్లాలోని నార్కట్‌పల్లి మండలాన్ని పైలెట్‌గా ఎంచుకున్నారు. శనివారం అమ్మనబోలులో ఈ విధానం ద్వారా సుమారు 57 మంది పెన్షన్ దారులకు డబ్బు అందజేసే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రయోగాత్మక అమలులో గుర్తించిన లోపాలను సవరించి ఈ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలుచేయనున్నారు.

సమయం ఆదా...

ఇప్పటి వరకు పీవోటీడీ (పాయింట్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్ డివైజ్) ద్వారా పోస్టు ఆఫీసుల్లో ఉన్న ఫింగర్ ప్రింట్ (బయోమెట్రిక్) పరికరాలల్లో వేలిముద్ర వేయించి పెన్షన్ ఇచ్చే విధానం అమలులో ఉంది. ఐతే పీవోటీడీ పరికరాలు కేవలం 2జీ సామర్థ్యం కలిగినవే కావడంతో సిగ్నల్స్ అందక, కొందరి వేలిముద్రలను..

- మిగతా 8వ పేజీలో...

కేంద్రం బీసీ మంత్రిత్వశాఖ
ఏర్పాటు చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నల్లగొండ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు డిమాండ్ చేశారు. బీసీలు ఎదుర్కొంటున్న పరిష్కరించాలని ఆగస్టు 7వ తేదీన గోవాలో నిర్వహించనున్న ఓబీసీ మహాసభ పోస్టర్‌ను జిల్లాకేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. దేశంలో మొట్టమొదటి సారి బీపీ మండల్ సిఫార్సుల ప్రకారం ఉద్యోగ రంగాల్లో 27 శాతం రిజర్వేషన్‌ను దివంగత ప్రధాన మంత్రి వీపీసింగ్ అమలు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థలో క్యాబినెట్ తీర్మానం చేసి గవర్నర్‌కు పంపినా ఇంతవరకు ఆమోదం తెలపలేదన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, నాయకులు కాసోజు విశ్వనాథం, నల్ల సోమమల్లన్న, కంది సూర్యనారాయణ, జివ్వాజి ఇంద్రయ్య, గంజి బిక్షమయ్య, జెల్ల అధినారాయణ, వాడపల్లి సాయిబాబా, నల్ల మధుయాదవ్, కందుల వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి పోలీస్ గ్రీవెన్స్ రద్దు

నల్లగొండ క్రైం, జూలై 27(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్ డేను రద్దు చేసినట్లు పోలీస్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎస్పీ శరత్ చంద్రపవార్ అందుబాటులో లేనందున కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొంది.

గ్రామ పాలన అధికారుల
సర్వేయర్ల పరీక్షలు ప్రశాంతం

నల్లగొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలన అధికారులు, లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షలు ఆదివారం జరిగాయి. పట్టణంలోని ఎన్జీ కళాశాలలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షకు 378మంది హాజరు కావాల్సి ఉండగా 300మంది హాజరయ్యారు. 78 మంది గైర్హాజరయ్యారు. గ్రామ పరిపాలన అధికారుల పరీక్షకు 129మందికి గాను 110మంది హాజరయ్యారు. 19మంది గైర్హాజరయ్యారు. జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి నల్లగొండ ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

నేటి మొక్కలే రేపటి వృక్షాలు

మిర్యాలగూడ టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): నేటి మొక్కలే రేపటి వృక్షాలని పర్యావరణ ప్రియుడు రావుల శ్రీనివాస్ అన్నారు. మొక్కల పెంపకంపై ఆదివారం పట్టణంలోని పలు కాలనీలలోని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన రావుల శ్రీనివాస్ మాట్లాడుతూ స్వయంగా పెంచిన మొక్కలను రైతులకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. తుమ్మ, బొప్పాయి, వేప, నేరేడు మొక్కలను అన్నదాతలకు అందించేందుకు పెంచుతున్నట్లు తెలిపారు. ప్రతీ విద్యార్థి ఈ సీజన్‌లో ఒక మొక్కని నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు.



మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్



సభలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్, వేదికపై కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ/చందంపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు మంజూరుచేస్తామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తోందని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఆదివారం దేవరకొండలోని 20వ వార్డులో రూ.1.35కోట్లతో నిర్మించనున్న సీసీరోడ్ల పనులకు ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం చందంపేట మండలం పోలేపల్లిలో చందంపేట, నేరేడుగొమ్ము మండలాలకు చెందిన లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు అందజేస్తోందన్నారు. జిల్లాలో 62,155 నూతన రేషన్‌కార్డులు మంజూరుకాగా, దేవరకొండ నియోజకవర్గంలో నూతనంగా 11,736మంది లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. దేవరకొండ నియోజకవర్గానికి ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేసి అధిక ప్రాధాన్యం ఇస్తానన్నారు. నియోజకవర్గంలో గురుకులాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. దళిత, గిరిజన, మైనార్టీ సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు.

అన్ని హామీల అమలు : ఎమ్మెల్యే బాలునాయక్

సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అంచలంచెలుగా అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు. నియోజకవర్గంలో రూ.360కోట్ల రైతు రుణాలు మాఫీ అయ్యాయన్నారు.ఐదేళ్లలో 20 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి అర్హులైన పేదలందరికీ పంపిణీ చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయాలని,పోలేపల్లి వద్ద ఐటీఐ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. పెండ్లిపాకల, నక్కలగండి భూనిర్వాసితులందరికీ పరిహారం అందజేస్తామన్నారు.

పేదల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తోందని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. కాంగ్రెస్ బడుగు, బలహీనవర్గాల పార్టీ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ అబద్ధాలతో మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి చత్రునాయక్, కృష్ణవేణి, శైలజ, మార్కెట్ కమిటీ చైర్మన్ జమున మాధవరెడ్డి, తహసీల్దార్ ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సాయిసన్నిధిలో పూజల్లో పాల్గొన్న మంత్రి

చింతపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): దేవరకొండకు వెళ్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చింతపల్లి సాయినాథుడిని దర్శించుకున్నారు. తొలుత ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం మంత్రిని ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో మాల్ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, ఎరుకుల వెంకటయ్య గౌడ్, ముచ్చర్ల యాదగిరి, అంగిరేకుల గోవర్ధన్, మాస భాస్కర్, గుండ్లపల్లి నరసింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్‌యాదవ్, పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలి

రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నల్లగొండరూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ, రిజర్వాయర్లను లింక్ కెనాల్ ద్వారా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని డాక్టర్స్‌కాలనీలో సిద్ధార్థ కాలేజీలో ఆదివారం నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదని అన్నారు. ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని, రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులందరికీ నాణ్యమైన విత్తనాలు, యూరియా, పురుగు మందులను అందించాలని అన్నారు. ఈ మహాసభకు ముందు లెక్కల రామచంద్రారెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఊట్కూరు మధుసూదన్‌రెడ్డి, కుంభం కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు పిన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి నకిరేకంటి జానయ్య, కోశాధికారి బోధనపు వెంకటరెడ్డి, కమిటీ సభ్యులుగా బట్టు నిర్మల, సత్తయ్య, రామకృష్ణారెడ్డి, విష్ణుమూర్తి, పాక మల్లయ్య, రామచంద్రారెడ్డి, బుచ్చిరెడ్డి, చెరుపల్లి విజయ, ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ వైస్‌చైర్మన్ సయ్యద్ ఆసం, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, కుంభం లక్ష్మమ్మ, ప్రసన్న, సరిత, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



స్కూటీపై వచ్చి మిర్యాలగూడలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడటౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆదివారం ఆయన ద్విచక్ర వాహనంపై పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంద్రాగస్టు నాటికి పట్టణంలో చెత్తకుప్పలు లేకుండా చూడాలన్నారు. డ్రైనేజీల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ సాగించాలని, ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మునిసిపల్ వార్డు ఆఫీసర్లతో వార్డుల వారీగా చెత్త, డ్రైనేజీ వ్యవస్థపై సమీక్ష నిర్వహించాలని, ప్రజా సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

శ్రావణమాసంలో..
కొండెక్కిన కొబ్బరి



» పెరిగిన టెంకాయ ధర » బెంబేలెత్తుతున్న భక్తులు

ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్

శ్రావణమాసం పండుగలకు ప్రసిద్ధి. ఈ మాసంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతుంటాయి.దీంతో ఆలయాలకు వచ్చే భక్తుల సంఖ్య సైతం అధికంగానే ఉంటుంది. ఆలయాలకు వెళ్లే భక్తులు టెంకాయ సమర్పించడం ఆనవాయితీ. అయితే పెరిగిన టెంకాయ ధరలు భక్తులను బెంబేలెత్తిస్తున్నాయి. సన్న రకం కాయల ధర రూ.25 నుంచి 30 వరకు ఉండగా, లావు టెంకాయ ధర రూ.35 నుంచి రూ.40 వరకు పలుకుతోంది. 7

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం


మిర్యాలగూడ టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): అనుములలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మల్లిఖార్జున్ ఒక ప్రకటనలో కోరారు. ఐటీఐ కళాశాలలోని పలు విభాగాలలో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. రెండో విడత సీట్ల భర్తీ కోసం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8686880100, 8341387860 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

పర్యాటక శాఖ ఉద్యోగికి ఘనంగా నివాళి

నాగార్జునసాగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌కు చెందిన వట్టికోటి వెంకటేశ్వర్లు (49) తెలంగాణ పర్యాటక శాఖ ప్రధాన కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఆదివారం ఉదయం సాగర్‌కు తీసుకువచ్చారు. ఆయన మృతదేహానికి జిల్లా పర్యాటకశాఖ అధికారి శివాజీ, సిబ్బంది వెంకటేశ్వర్లు నివాళులర్పించారు.

దడ పుట్టిస్తున్న ధరలు

- పెరిగిన కూరగాయల రేట్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



వెంకటేశ్వరనగర్(మాల్)లో గిరాకీ లేక వెలవెలబోతున్న కూరగాయల దుకాణాలు

చింతపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ధరలకు సామాన్య ప్రజలు విలవిలలాడుతున్నారు. కొన్ని రోజులుగా పెరుగుతున్న కూరగాయల ధరలు ప్రజలకు మంట పుట్టిస్తున్నాయి. నెల రోజుల క్రితం రూ.250తో వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం రూ.500 ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ లెక్కన ధరలు దాదాపు రెట్టింపు అయినట్లు అవగతమవుతుంది. ప్రధానంగా రోజూ వినియోగించే టమాటా, పచ్చిమిర్చి, ఉల్లి ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు కొనలేని తినలేని పరిస్థితి ఏర్పడింది.

వర్షాభావ పరిస్థితులే కారణం

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోటల్లో కూరగాయలు కొంతమేరకు దెబ్బతిన్నాయి. దీంతో వ్యాపారులు మార్కెట్‌కు తక్కువగా తీసుకువస్తున్నారు. ఫలితంగా ధరలు విపరీతంగా పెరిగాయి. పచ్చి మిర్చి, బీన్స్ రూ.100 చిక్కుడు రూ.110 పలుకుతుంది. ప్రతి నిత్యం అందరూ వంటలో వాడుకొనే టమాటా కిలో రూ.50కి చేరుకోగా ఉల్లిగడ్డ రూ.50 పలుకుతుంది. కాకర, కాలీఫ్లవర్ రూ.90 వరకు పెరిగింది. అలాగే ఆకు కూరలతో పాటు ఇతర కూరగాయల ధరలు భారీగానే పెరిగాయి. ప్రస్తుతం రూ.60 తక్కువ ధరలో కూరగాయలు లభించడం లేదు. ఆకుకూరలు గతంలో పోలిస్తే రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు.

మరో రెండు నెలల పాటు ఇలాగే

మరో రెండు నెలల పాటు కూరగాయల ధరలు ఇలాగే ఉండే అవకాశం ఉంది. రెండు జిల్లాల కూడలి ప్రముఖ కూరగాయల వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న వీటీనగర్ మార్కెట్‌లో ధరలు ఇలాగే కొనసాగితే సామాన్య ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. కూరగాయల సాగు తగ్గిపోవడం ఒక కారణం కాగా, మన ప్రాంతానికి దిగుమతి చేస్తున్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో వర్షాలకు తోటలు ధ్వంసమవడం ఒక కారణమని తెలుస్తుంది. ధరలు అమాంతంగా పెరగడం, ఇతర రాష్ట్రాల నుంచి ఎక్కువ దిగుమతి చేసుకోవడంతో తమకు గిట్టుబాటు ధర కావడం లేదని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజూ వచ్చే వినియోగదారులు దృష్టిలో పెట్టుకొని అరకొరగా స్టాక్ తెచ్చుకుంటున్నారు. ఇక కూరగాయలు విక్రయించే హోటళ్ల నిర్వాహకులు తమకు ఏ మాత్రం మిగలడం లేదని కూరల ధరలను రూ.10 నుంచి రూ.15 వరకు పెంచేశారు.

నియంత్రణ కమిటీ ఏర్పాటు చేయాలి



మార్కెట్‌లో కూరగాయల ధరలు విపరీతంగా పెరగంతో ఇబ్బందులు పడుతున్నాం. ధరల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేయాలి. సామాన్య ప్రజలకు చేరువలో ఉండేందుకు అధికారులు చొరవ తీసుకోవాలి.

- రాచమళ్ల భార్గవి, గృహిణి, వీటీనగర్



వెంకటేశ్వరనగర్ మార్కెట్ యార్డులో ధరలు ఇలా ఉన్నాయి

కూరగాయలు	గతనెలలో ధర	ప్రస్తుతం ధర
టమాట	30	50
పచ్చిమిర్చి	50	100
చిక్కుడు	70	90
బీన్స్	70	90
క్యారెట్	60	95
క్యాప్సికం	60	90
కాకరకాయ	50	85
ముల్లంగి	50	90
బెండకాయ	50	70
బీరకాయ	45	80
బీట్‌రూట్	55	75

ప్రాథమిక పాఠశాలకు నీటి సరఫరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

త్రిపురారం, జూలై 27(ఆంధ్రజ్యోతి): త్రిపురారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎట్టకేలకు మిషన్ భగీరథ అధికారులు నీటి సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ నెల 20న ఆంధ్రజ్యోతిలో 'విద్యార్థులకు నీటి వెతలు' అనే శీర్షికన కథనాన్ని ప్రచురించింది. విద్యార్థుల నీటి కష్టాలపై స్పందించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి నీటిని సరఫరా చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు పాఠశాల సమయంలో నీటిని సరఫరా చేసేందుకు అధికారులు రెండు రోజుల క్రితం చర్యలు తీసుకున్నారు. దాంతో విద్యార్థుల కష్టాలు తీరాయి. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

పెద్దఅడిశర్లపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వైద్యశిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు వంగాల అమరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంగడపేట ఎక్స్‌రోడ్డు వద్ద హిమాలయ హాస్పిటల్, హెల్త్‌కేర్ క్లినిక్ డయాగ్నస్టిక్ వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్యశిబిరంలో 300మందికి గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్ పరీక్షలు ఉచితంగా చేశారు. హిమాలయ హాస్పటల్ డాక్టర్లు శ్రీరేఖ, మౌనిక నాగారాపు, వినయ్‌రెడ్డి, ఉమాకాంత్ వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ప్రాక్టీషనర్ షేక్ సయ్యద్, ల్యాబ్ టెక్నీషియన్ ఆకనబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ నిధులతో రోడ్ల నిర్మాణం

- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి లక్ష్మణ్



సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి లక్ష్మణ్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేసి దేవరకొండ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని గ్రామాలకు రోడ్ల సౌకర్యం కల్పిస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని 20వ వార్డులో ఆదివారం ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవరకొండ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని అ న్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, జిల్లా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఈ మనోరమ, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, ఏఈ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లక్ష్మణ్‌కు వినతుల వెల్లువ

దేవరకొండ పట్టణానికి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు దేవరకొండలో విశ్వబ్రాహ్మణులు, విద్యార్థి సంఘాల నేతలు కలిసి వినతిపత్రాలు అందజేశారు. విశ్వబ్రాహ్మణ కులస్థులు, కులవృత్తులకు చేయూతనివ్వాలని విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకులు కోరారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్ మంత్రికి వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు

నేరేడుగొమ్ము, దేవరకొండలో మంత్రికి ఘనస్వాగతం

దేవరకొండ, నేరేడుగొమ్ము: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు చేపట్టాక మొదటిసారిగా దేవరకొండకు వచ్చిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు దేవరకొండ, నేరేడుగొమ్ము మండలాల్లో కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మెల్సీ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ మంత్రికి స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. మంత్రికి స్వాగతం పలికిన వారిలో కాంగ్రెస్ నల్లగొండ పార్లమెంటరీ ఇన్‌చార్జి ఎంఏ.సిరాజ్‌ఖాన్, నాయకులు ఆలంపల్లి నర్సింహ, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, పున్న వెంకటేశ్వర్లు, వడ్త్య దేవేందర్‌నాయక్, యూనుస్, ఆర్డీవో రమణారెడ్డి, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, నేరేడుగొమ్ము మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లోకసాని కృష్ణ, గడ్డం వెంకటయ్య, మాజీ జడ్పీటీసీ బాలు, నాయకులు భైరెడ్డి కొండల్‌రెడ్డి, బసవరెడ్డి, బిక్కునాయక్, రమేష్, సురేందర్‌రెడ్డి, యాదయ్య ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు గుండాల అంజయ్య

పెద్దఅడిశర్లపల్లి,జూలై27(ఆంధ్రజ్యోతి): కేంద్ర అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని నియోజకవర్గ సీనియర్ నాయకులు గుండాల అంజయ్య అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణపై ఆదివారం మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద మండల అధ్యక్షుడు వలసాని రామలింగం అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అన్ని సీట్లల్లో పోటీ చేసేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని అన్నారు. కాంగ్రెస్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అని ప్రజలను మోసం చేస్తుందన్నారు. మతపరమైన రిజర్వేషన్లు ఉండకూడదని బీఆర్ అంబేడ్కర్ స్పష్టం చేసినట్లు ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు వంగాల ప్రతాప్‌రెడ్డి, బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి, మండల జనరల్ సెక్రటరీ అంతిరెడ్డి, గోవింద్, శ్రీను, ఆంజనేయులు, తిరుపతి పాల్గొన్నారు.

ఫేస్ రికగ్నైజేషన్‌తో ఇక ఆసరా పెన్షన్

(5వ పేజీ తరువాయి)

పరికరం గుర్తించక పెన్షన్‌ల పంపిణీలో ఆలస్యం జరిగేది. దీంతో వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలు ఉన్న పెన్షన్‌దారులు గంటల తరబడి పోస్టాఫీసుల వద్ద వేచి ఉండాల్సి వచ్చేది. ఎండాకాలంలో అయితే కొందరు స్పృహతప్పి పడిపోగా వర్షాకాలంలో తడుస్తూ పెన్షన్‌దారులు ఇబ్బందులు పడేవారు. అవురవాణి లాంటి కొన్ని మారుమూల గ్రామాల్లో పీవీటీడీ పరికరానికి నెట్ సిగ్నల్స్ అందక డాబాలపైకి ఎక్కి పెన్షన్‌దారులు వేలిముద్రలు ఇచ్చే పరిస్థితి ఇప్పటికీ ఉంది. ఒక్కో పెన్షన్‌దారుడికి కనీసం 2 నుంచి 5 నిమిషాల సమయం పట్టేది. కానీ సరికొత్త ఫేస్ రికగ్నైజేషన్ విధానంతో సిగ్నల్ సమస్య ఉండదు. కేవలం 5 సెకన్లలోపే పెన్షన్ ఇచ్చే సాంకేతిక పరిజ్ఞానం ఇందులో ఉంది.

అక్రమాలకు చెక్

ఫేస్ రికగ్నైజేషన్ విధానంతో అక్రమాలకు చెక్ పడనుంది. గతంలో కొందరు రాజకీయ ఒత్తిడితో స్థానికంగా ఉండని వారి అనుచరుల పెన్షన్‌లను పంచాయతీ కార్యదర్శుల ద్వారా పొందినట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇకపై ఇలాంటి అక్రమాలకు చెక్ పడినట్టే. నేరుగా పెన్షన్‌దారుడు యాప్‌లో ముఖం చూపి, కను రెప్పలు కొట్టడం ద్వారా పెన్షన్ ఇచ్చే విధానంతో నేరుగా పెన్షన్ దారుడికే డబ్బు అందనుంది.

బీపీఎంలకు కొత్త స్మార్ట్ ఫోన్లు

ఫేస్ రికగ్నైజేషన్ యాప్ విధానం అమలు కోసం రాష్ట్రంలోని సుమారు 6వేల మంది ఉన్న బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌లకు 5జీ సామర్థ్యం కలిగిన కొత్త స్మార్ట్ ఫోన్‌లను, డివైజ్‌లను అందించనున్నట్లు తెలిసింది. పూర్తి సెర్ప్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌ను ఫోన్‌లో సెర్ప్‌కు చెందిన టెక్నికల్‌టీం ద్వారానే లోడ్ చేసి ఇవ్వనున్నారు. కేవలం 2 నుంచి 5 సెకన్ల లోపే యాప్ ద్వారా పెన్షన్ పొందే సాంకేతికతను పొందుపర్చారు. ఇప్పటికే ఈ విధానంపై బీపీఎంలకు అవగాహన కల్పించారు.

ఆరుసార్లు గుర్తించకపోతే

సరికొత్త విధానం ద్వారా ఏ పెన్షన్‌దారుడి ముఖాన్ని యాప్ గుర్తించలేని పక్షంలో ప్రత్యామ్నాయంగా పాత పద్ధతిలో వేలిముద్ర వేయించి ఇచ్చేలా వెసులుబాటు కల్పించారు. స్మార్ట్ ఫోన్‌లో యాప్ లాగిన్ అయిన తర్వాత పెన్షన్‌దారుడి పోస్టల్ అకౌంట్ నెంబరును నమోదు చేస్తారు. వెంటనే ఫోన్‌లో సదరు లబ్ధిదారుడి వివరాలు వస్తాయి. అనంతరం ఫేస్ రికగ్నైజేషన్ విధానంలోకి వెళ్తారు. కంటి రెప్పలను బ్లింకింగ్ చేయడం ద్వారా వివరాలు సరైనవే అయితే పెన్షన్ డబ్బు ఎంతో చూపిస్తుంది. లేదంటే ఎర్రర్‌గా పేర్కొంటుంది. ఇలా ఆరుసార్లు కూడా ఎర్రర్ వస్తే సదరు పెన్షన్‌దారుడికి పాత వేలిముద్ర సేకరణ పద్ధతిలోనే పెన్షన్ ఇచ్చే వీలు కల్పించారు.

రోగుల పెన్షన్లు ఎలా?

కొత్త విధానం బాగానే ఉన్నా మంచానికే పరిమితమైన పెన్షన్‌దారుల పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. అతంలో పెన్షన్‌దారుడు మంచానికే పరిమితమైన లేదా దివ్యాంగుడైనా, బయోమెట్రిక్‌లో వేలిముద్ర పడకపోయినా పంచాయతీ కార్యదర్శి వేలిముద్రతో సంబంధిత పెన్షన్‌దారుడికి డబ్బు ఇచ్చే అవకాశం ఉండేది. కానీ ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ప్రవేశపెట్టాక పంచాయతీ కార్యదర్శులతో సంబంధం ఉండదు. దీంతో మంచానికే పరిమితమైన రోగి ఇంటికి పోస్టల్ సిబ్బంది వెళ్లి పెన్షన్ పంపిణీ చేయాలని ప్రస్తుతానికి ఆదేశాలు ఉన్నాయి. అయితే ఇళ్లకు వెళ్లి పెన్షన్ ఇచ్చే విధానంపై పోస్టల్ సిబ్బంది అభ్యంతరం చెబుతున్నారు. పెన్షన్ డబ్బు ఉన్న బ్యాగు చేత పట్టుకుని ఇళ్లకు వెళ్తే భద్రతాపరంగా ఇబ్బందులు ఎదురవుతాయని పోస్టల్ సిబ్బంది పేర్కొంటున్నారు.

రాష్ట్రమంతా ఇదే విధానం

బహుళ ప్రయోజనాలు ఉండే ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా ఆసరా పెన్షన్లు ఇచ్చే విధానం రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశపెట్టనున్నాం. ఈ మేరకు ప్రభుత్వం కూడా ఆదేశాలు, సూచనలు జారీ చేసింది. సెర్ప్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన యాప్ పనితీరును పరిశీలించేందుకు సంగారెడ్డి జిల్లాలోని ఓ మండలంతో పాటు జిల్లాలో నార్కట్‌పల్లి మండలాన్ని ఎంపిక చేసుకున్నాం. యాప్ ద్వారా ఆసరా పెన్షన్లు ఇచ్చే ప్రయోగాత్మక విధానం అమ్మనబోలులో విజయవంతమైంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 22లక్షల మంది ఆసరా పెన్షన్ దారులకు ఇదే విధానంలో పెన్షన్ ఇవ్వనున్నాం.

- కర్నాటి గోవర్ధన్, సెర్ప్ అదనపు డైరెక్టర్

అబ్దుల్ కలాం అడుగుజాడల్లో పయనించాలి



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ రాజు

మిర్యాలగూడ టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం అడుగుజాడల్లో యువత పయనించాలని సోషల్ వర్కర్ డాక్టర్ జాడి రాజు అన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆదివారం గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పాఠకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం క్రమశిక్షణ, పట్టుదలతో మిసైల్ మ్యాన్‌గా ఎదిగాడని, దేశానికే రాష్ట్రపతి అయ్యాడని కొనియాడారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకొని చూపిన మార్గంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సంఘ రాష్ట్ర కన్వీనర్ మాళోతు దశరథనాయక్, బీసీ జేఏసీ కోకన్వీనర్ చేగొండి మురళియాదవ్, దాసరాజు జయరాజు, జెక్క నాగేశ్వర్, వెంకన్న, దుర్గయ్య, రవి, శివ, చరణ్, శ్రీనునాయక్, సతీష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ డివిజన్‌లో

ఆగని నల్లబెల్లం, పటిక అక్రమ రవాణా

- జోరుగా నాటుసారా విక్రయాలు
- దాడులు చేస్తున్నా ఆగని దందా
- కఠినచర్యలు తీసుకుంటామని అధికారుల హెచ్చరిక

దేవరకొండ, జూలై 27(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లోని తండాలు, గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, దేవరకొండ ఎక్సైజ్ పోలీసులు దాడులు చేస్తున్నా నల్లబెల్లం, పటిక అక్రమరవాణా ఆగడం లేదు. గ్రామాలు, తండాల్లో నాటుసారా విక్రయాలు పెరుగుతూనే ఉన్నాయి. వర్షాకాలం కావడంతో నాటుసారా తయారీపై కొంతమంది వ్యాపారులు దృష్టి సారించి ఉపాధి పొందుతున్నారు. లాభదాయకంగా ఉండటంతో అధిక ఉత్పత్తి చేస్తుండటంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.


ఈ ఏడాది జనవరి నుంచి దేవరకొండ ఎక్సైజ్ పోలీసులు సర్కిల్ పరిధిలో నాటుసారా విక్రయదారులపై 250 కేసులు నమోదు చేశారు. 202 మందిని అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. 845 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. నల్లబెల్లం 735 కిలోలు, 375 కేజీల పటిక, 48 వాహనాలు సీజ్ చేయడంతో పాటు 18950 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. దీనిని బట్టి చూస్తే డివిజన్‌లో నాటుసారా విక్రయాలు ఏ విధంగా జరుగుతున్నాయనేది తెలుస్తుంది. నాటుసారా వ్యాపారం లాభదాయకంగా ఉండటం, లీటర్ సారా రూ.150 నుంచి 200 వరకు విక్రయిస్తున్నారు. సారా తయారీకి కావాల్సిన నల్లబెల్లం పౌడర్, పటికలను హైదరాబాద్ పటాన్‌చెరువు నుంచి వాహనాల్లో తీసుకువస్తున్నట్లు సమాచారం. డివిజన్ పరిధిలోని చందంపేట, డిండి, నేరేడుగొమ్ము, పీఏపల్లి, గుడిపల్లి, చింతపల్లి, దేవరకొండ మండలాల్లో నాటుసారా విక్రయాలు జరుగుతున్నాయి. చందంపేట మండలం కంబాలపల్లి, పొగిళ్ల తండాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్లకు కూడా మర పడవలలో నాటుసారా తరలివెళ్తుంది. దేవరకొండ ఎక్సైజ్ అధికారులతో పాటు జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేస్తున్నారు. కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నా నాటుసారా విక్రయాలు, నల్లబెల్లం, పటిక అక్రమ రవాణా ఆగడం లేదు. పీడీ యాక్టుతో పాటు నాటుసారా విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటేనే విక్రయాలు అదుపులోకి వస్తాయని పలువురు సూచిస్తున్నారు. ఎక్సైజ్ పోలీసులతో పాటు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి నాటుసారా విక్రయాలను అరికట్టడానికి కఠినచర్యలు తీసుకోవాల్సి ఉంది. నాటుసారా తాగడం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని, ఆరోగ్యం దెబ్బతింటుందని డాక్టర్లు, వైద్యాధికారులు చెబుతున్నా నాటుసారా తక్కువ ధరకు లభిస్తుండటంతో సారా వైపే మొగ్గు చూపుతూ దానికి బానిసలవుతున్నారు.



చందంపేట మండలంలో నాటుసారా తయారు చేసే బెల్లం పానకాన్ని ధ్వంసం, నల్లబెల్లం పటిక పట్టుకున్న దేవరకొండ ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)



దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం



నాటుసారా తయారీదారులపై నిఘా ఏర్పాటు చేశాం. జిల్లా టాస్క్‌ఫోర్స్, దేవరకొండ సర్కిల్ పోలీసులు దాడులు నిర్వహించి నల్లబెల్లం, పటికలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నాటుసారా కేంద్రాలపై దాడులు చేస్తూనే ఉన్నాం. ఏడాదిలో రెండు పర్యాయాలకుపైగా నల్లబెల్లం, పటిక సారాతో పట్టుబడితే పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తాం. ప్రజలు సహకరించాలి.

- శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ, దేవరకొండ